


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 26, పేజీలు - 08

సోమవారం, జూన్ 30, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## మరో మూడు నెలల్లో కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్.?

**- కర్ణాటక రాజకీయాల్లో మళ్లీ రాజుకున్న నాయకత్వ మార్పు చర్చ**



**బెంగుళూరు (ప్రశ్న న్యూస్)** కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి మార్పుపై సాగుతున్న ఊహాగానాలకు కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్.ఏ. ఇక్బాల్ హుస్సేన్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆజ్యం పోశాయి. మరో రెండు లేదా మూడు నెలల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి పదవి దక్కవచ్చని ఆయన ఆదివారం

2లో..

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం వెనుక కుట్రకోణం?

**- కేంద్ర విమానయాన మంత్రి కీలక వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఎయిరిండియాకు చెందిన ఏఐ 171 విమానం అహ్మదాబాద్‌లో దుర్ఘటనకు గురై 260 మంది మృతి చెందడం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అహ్మదాబాద్ నుంచి లండన్ వెళుతున్న ఈ విమానం టేకాఫ్ తీసుకున్న కొన్ని క్షణాలకే ఓ మెడికల్ కాలేజీ హాస్టల్‌పై కుప్పకూలింది. అయితే ఈ ప్రమాదం వెనుక

2లో..

## ఉత్తరాఖండ్ లో భారీ వర్షాలు

**- చార్ ధామ్ యాత్రకు బ్రేక్**



**డెహ్రాడూన్ (ప్రశ్న న్యూస్)** దేవభూమి ఉత్తరాఖండ్‌ను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానల కారణంగా జనజీవనం స్తంభించింది. ఈ నేపథ్యంలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని చార్‌ధామ్ యాత్రను 24 గంటల పాటు తాత్కాలికంగా

2లో..

# టీ బీజేపీ అధ్యక్షుడిగా.. ఏకగ్రీవమే

**- ఏకగ్రీవ నిర్ణయంపై అధిష్టానంపై ఫోకస్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో బీజేపీ అధ్యక్ష పదవి కోసం ఉత్కంఠ రేపుతున్న పోటీ, ఢిల్లీ నేతల సమన్వయం, సామాజిక సమీకరణాలతో కూడిన ఎన్నిక ప్రక్రియ హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ కేంద్రంలో అధికారంలో ఉండటం, రాష్ట్రంలో పెరుగుతున్న రాజకీయ ప్రాధాన్యంతో అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ కీలకంగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బీజేపీ అధ్యక్ష ఎన్నికలకు ఒకేసారి నోటిఫికేషన్ జారీ అయింది. నామినేషన్ ప్రక్రియ నేడు మధ్యాహ్నం వరకు కొనసాగనుంది. ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు వస్తే, మంగళవారం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఈ ఎన్నికల పరిశీలకురాలిగా కర్ణాటకకు చెందిన శోభ కరంద్లాజే నియమితులయ్యారు. ఈ ప్రక్రియలో ఢిల్లీ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తూ, ఏకగ్రీవ ఎన్నికకు ప్రాధాన్యం ఇస్తోంది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ, ఏకగ్రీవ ఎన్నికే లక్ష్యమని వ్యాఖ్యానించారు.

### అధ్యక్ష రేసులో ఉన్నది వీరే..

తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి కోసం పలువురు సీనియర్ నేతలు పోటీలో ఉన్నారు. రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్లు ముందున్నాయి. అయితే, ఢిల్లీ సమాచారం ప్రకారం, ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్‌లో ఒకరికి అధ్యక్ష పదవి దక్కే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ ఇద్దరూ తమ సొంత సామాజిక సమీకరణాలు, రాజకీయ అనుభవంతో పార్టీలో బలమైన స్థానం కలిగి ఉన్నారు.

- ధర్మపురి అర్వింద్: నిజామాబాద్ ఎంపీగా బలమైన స్థానిక పట్టు, యువ నాయకత్వం, దూకుడైన రాజకీయ శైలి ఆయన సానుకూల అంశాలు.
- ఈటల రాజేందర్: మల్కాజ్‌గిరి ఎంపీగా, గతంలో టీఆర్ఎస్‌లో కీలక నేతగా ఉన్న అనుభవం, సమన్వయ నైపుణ్యం ఆయన బలం.

### ఢిల్లీ వ్యూహం..

బీజేపీ అధ్యక్ష ఎన్నికలో సామాజిక సమీకరణాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, రెడ్డి, కమ్మ వంటి సామాజిక వర్గాల సమతుల్యతను పరిగణనలోకి తీసుకుంటూ నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీ నేతలు భావిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్,

2లో..

## తెలంగాణ మహిళలపై ప్రధాని మోదీ ప్రశంసలు

**- అద్భుతం చేశారంటూ కితాబు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** మన్ కీ బాత్ 123వ ఎపిసోడ్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ భారతదేశ సామాజిక పురోగతి, ఆరోగ్య రంగంలో విజయాలు, మహిళా సాధికారతతో పాటు చారిత్రక మైలురాళ్ల గురించి ప్రస్తావించారు. ఇటీవల అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన విషయాలను, స్ఫూర్తిదాయకమైన స్థానిక అంశాలు, దేశవ్యాప్తంగా జరుగుతున్న మార్పులను ప్రధాని మోదీ పేర్కొన్నారు. తెలంగాణలోని భద్రాచలం మహిళలు సాధించిన విషయాన్ని ముఖ్యంగా ప్రస్తావించారు.

**- భారతదేశంలో 64% మందికి పైగా సామాజిక భద్రత**

భారతదేశంలో సామాజిక సంక్షేమం పెరిగిందని హైలైట్ చేశారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ:

2లో..

## ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ కేంద్రాలుగా ప్రత్యేక జోన్లు



**- ఇన్వెంట్ ఇన్ తెలంగాణ**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** 'మేకిన్ ఇండియా' కాదు.. 'ఇన్వెంట్ ఇన్ తెలంగాణ' అన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ నినాదం, లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. తెలంగాణను ఇన్నోవేషన్ హబ్ గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**- జాతీయ సగటు కంటే 6 రెట్లు తెలంగాణలో**

హైటెక్స్ లో 'ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ

2లో..

## నిజం గడప దాటేలోగా..
# అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది

- ప్రభుత్వ వార్షికోత్సవం సందర్భంగా 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం
- నెల రోజుల పాటు ప్రజల్లోకి వెళ్లాలని ఎమ్మెల్యేలు, ఎంపీలకు చంద్రబాబు ఆదేశం
- మనం చేసిన మంచి పనులను వివరిస్తూనే, వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు
- ప్రతి ఎమ్మెల్యే పనితీరుపై సర్వేలు చేయిస్తున్నా, బాగోకపోతే చర్యలు తప్పవని హెచ్చరిక
- తప్పులు పునరావృతం కావొద్దని, 2029 గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచన



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో ప్రతిపక్ష వైసీపీ పన్నుతున్న కుట్రలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా, నెల రోజుల పాటు ప్రజల్లో విస్తృతంగా పర్యటించాలని ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నేతలకు ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, పరిశీలకులతో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు'

2లో..

## నెరవేరిన పసుపు రైతుల చిరకాల కల

**- నిజామాబాద్‌లో పసుపు బోర్డు ప్రారంభించిన అమిత్ షా**
**- పసుపు రైతుల సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందని హామీ**



**నిజామాబాద్ (ప్రశ్న న్యూస్)** దశాబ్దాల పోరాటం తర్వాత నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు కల ఎట్టకేలకు సాకారం అయింది. నిజామాబాద్ పసుపు రైతులు దాదాపు 40 ఏళ్లుగా పసుపు బోర్డు కోసం పోరాడగా ఈ ఏడాది జనవరి 14న కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటుపై అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ ఈ బోర్డును వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం భవనం నిర్మాణం జరిగి పూర్తి స్థాయిలో నిజామాబాద్‌లోని వినాయక నగర్‌లో కొలువుదీని పసుపు బోర్డును ఆదివారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన అమిత్ షా పసుపు రైతుల 40 ఏళ్ల కలను ప్రధాని నరేంద్ర మోదీ నెరవేర్చారన్నారు. అంతేకాకుండా తెలంగాణ పసుపు రైతల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నిజామాబాద్ పసుపుకు రాజధాని లాంటిదని ఆయన కొనియాడారు. ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,

2లో..

## విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

**- ఏపీఈసెట్ అడ్మిషన్లే పెద్ద ఉదాహరణ**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, అందుకు ఏపీ ఈసెట్ అడ్మిషన్ల ప్రక్రియలో జరుగుతున్న తీవ్ర జాప్యమే నిదర్శనమని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఫలితాలు వెలువడి నెలన్నర రోజులు గడుస్తున్నా

2లో..

## ఫలించిన 60 ఏళ్ల పోరాటం

**- పార్క్ ఆక్రమణలు తొలగించిన హైడ్రా**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లోని ఎల్లారెడ్డిగూడ మధురానగర్ మెట్రో రైల్వే స్టేషన్ సమీపంలో దశాబ్దాలుగా ఆక్రమణకు గురైన పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు విజయవంతంగా తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఇది సాయి సారధినగర్ నివాసితులకు 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి శుభప్రదం పలికింది. 1533 గజాల విస్తీర్ణంలోని ఈ పార్కు ఇప్పుడు స్థానిక ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

2లో..

## ఉక్రెయిన్ పై రష్యా అతిపెద్ద గగనతల దాడి

**- 477 డ్రోన్‌లు, 60 క్షిపణులతో దాడి**

2లో..



## రైల్వే ప్రయాణికులకు అలర్ట్

**- ఇకపై 8 గంటల ముందే చార్ట్ రెడీ**

**-కీలక మార్పులు తీసుకురానున్న రైల్వే శాఖ**

3లో..



## తెలంగాణలో బీఆర్ఎస్ పోయింది కానీ అవినీతి మాత్రం పోలేదు

**- బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ మౌనమెందుకు? అంటూ ప్రశ్న**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో బీఆర్ఎస్ పోయింది కానీ, అవినీతి మాత్రం పోలేదు. అధికారం మారింది, కానీ దోపిడీ తీరు మారలేదు.. ఇది నిజామాబాద్ సాక్షిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ఘాటైన వ్యాఖ్య. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, తెలంగాణను ఢిల్లీ పెద్దల ఏటీఎంగా మార్చిందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిజామాబాద్ రైతుల దశాబ్దాల కలను సాకారం చేస్తూ, ఆదివారం జాతీయ పసుపు బోర్డు ప్రధాన

3లో..

## జూబ్లీహిల్స్ బైపోల్ వేళ
# కీలక పరిణామాలు

**- గెలుపెవరిది.?**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఇప్పుడు జూబ్లీహిల్స్ బై పోల్ పై ప్రధాన పార్టీలో కసరత్తు మొదలు పెట్టాయి. సిట్టింగ్ స్థానం కాపాడుకోవటం కోసం బీఆర్ఎస్ కొత్త వ్యూహాలు అమలు చేస్తోంది. అటు కంటోన్మెంట్ తరహాలో జూబ్లీహిల్స్ సైతం దక్కించుకోవాలనేది సీఎం రేవంత్ ఆలోచన. బీజేపీ తమ అభ్యర్థి విషయంలో మంత్రాంగం ప్రారంభించింది. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ సర్వేలు చేయిస్తూ పబ్లిక్ మూడ్ తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఇక్కడ ఎంఐఎం కీలకం కానుంది. కాగా, బీఆర్ఎస్ తాజాగా తీసుకున్న నిర్ణయంతో కాంగ్రెస్ నెక్స్ట్ స్టెప్ ఏంటనేది ఆసక్తిగా




3లో..

# మరో మూడు నెలల్లో కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్.?

వ్యాఖ్యానించడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ అధిష్టానం సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉందా అని విలేకరులు ప్రశ్నించగా, ఇక్బాల్ హుస్సేన్ స్పందిస్తూ, "ఈ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ బలం ఏంటో అందరికీ తెలుసు. ఈ విజయం కోసం ఎవరు కష్టపడ్డారో, చెమటోడ్చి పనిచేశారో కూడా అందరికీ తెలిసిందే. ఆయన (డీకే శివకుమార్) వ్యూహాలు, కార్యక్రమాలు ఇప్పుడు చరిత్రలో నిలిచిపోయాయి," అని అన్నారు. అధిష్టానానికి పరిస్థితిపై పూర్తి అవగాహన ఉందని, సరైన సమయంలో డీకేకు అవకాశం కల్పిస్తుందనే నమ్మకం తమకుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాదే డీకే శివకుమార్ సీఎం అవుతారా అని అడగ్గా, "అవును, నేను అదే చెబుతున్నాను. రెండు, మూడు నెలల్లోనే నిర్ణయం వెలువడుతుంది. సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో సంచలన మార్పులు ఉంటాయని కొందరు నేతలు చెబుతున్నది దీని గురించే. నేను దాచిపెట్టి మాట్లాడటం లేదు, నేరుగానే చెబుతున్నాను," అని ఇక్బాల్ స్పష్టం చేశారు. గతంలో సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న చేసిన "విప్లవాత్మక" మార్పుల వ్యాఖ్యలపై మాట్లాడుతూ, "విప్లవం అంటే అర్థం ఏమిటి? రాజకీయాల్లో మార్పులు రావడం సర్వసాధారణం. అర్హులైన వ్యక్తికి అవకాశం ఇవ్వడాన్ని విప్లవం అని అనలేం. సమయం వచ్చినప్పుడు ఎవరికి బాధ్యతలు అప్పగించాలో అధిష్టానం నిర్ణయిస్తుంది," అని వివరించారు. మరో పార్టీ వచ్చి ప్రభుత్వాన్ని పడగొడితే దాన్ని విప్లవం అనవచ్చని, కానీ ఇప్పుడు అలాంటిదేమీ జరగడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి మెజారిటీతో బలంగా ఉందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుమారుడు, ఎమ్మెల్సీ యతీంద్ర సిద్ధరామయ్య ఈ వార్తలను కేవలం ఊహాగానాలుగా కొట్టిపారేయడంపై ఇక్బాల్ స్పందిస్తూ, "2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రభుత్వ ఏర్పాటుపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో కూడిన అధిష్టానమే నిర్ణయం తీసుకుంది. ఆ విషయం అందరికీ తెలుసు. తదుపరి నిర్ణయం కూడా వారే తీసుకుంటారు. దాని కోసం వేచి చూడాలి," అని అన్నారు. కాంగ్రెస్‌లో క్రమశిక్షణ, నిబద్ధత ఉన్నాయని, పార్టీలో ఒకే పవర్ సెంటర్ ఉందని, అది అధిష్టానం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. పార్టీ కోసం ఎందరో త్యాగాలు చేశారని, ప్రస్తుత పరిస్థితుల్లో మార్పు రావాలని అందరూ ఆశిస్తున్నారని, అయితే అది విప్లవం కాదని ఆయన పేర్కొన్నారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదం వెనుక కుట్రకోణం?

కుట్రకోణం ఉండే అవకాశాలున్నట్టు వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై కేంద్రం స్పందించింది. ఈ ఉదంతంలో కుట్ర కోణంపై కూడా దృష్టి సారించినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తును ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) చేపట్టిందని, అన్ని కోణాల్లోనూ విచారణ జరుపుతోందని ఆయన స్పష్టం చేశారు. పుణెలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. విమానం నుంచి స్వాధీనం చేసుకున్న బ్లాక్‌బాక్స్‌ను విశ్లేషణ కోసం విదేశాలకు పంపుతున్నారంటూ వస్తున్న ఊహాగానాలను మంత్రి మురళీధర్ పూర్తిగా ఖండించారు. "బ్లాక్‌బాక్స్ మన దేశంలోనే, దర్యాప్తు సంస్థల వద్దే సురక్షితంగా ఉంది. దానిని ఎక్కడికీ పంపే ప్రసక్తే లేదు" అని ఆయన తేల్చిచెప్పారు. ఇది చాలా విషాదకరమైన ఘటన అని, ఏఏఐబీ దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభించిందని తెలిపారు. సీసీటీవీ ఫుటేజీని విశ్లేషించడంతో పాటు పలు ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వివరించారు. రెండు ఇంజిన్లు ఒకేసారి విఫలం కావడం అనేది అత్యంత అరుదైన విషయమని మంత్రి పేర్కొన్నారు. "ఇది చాలా ప్రత్యేకమైన కేసు. అసలు రెండు ఇంజిన్లు విఫలమయ్యాయా లేక ఇంధన సరఫరాలో ఏమైనా సమస్య తలెత్తిందా అనేది దర్యాప్తు నివేదిక వస్తేనే స్పష్టత వస్తుంది" అని ఆయన అన్నారు. బ్లాక్‌బాక్స్‌లోని కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో పైలట్ల సంభాషణలు నిక్షిప్తమై ఉంటాయని, దర్యాప్తులో అది కీలకం కానుందని తెలిపారు. మరో మూడు నెలల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందని, కాబట్టి ఇప్పుడే దీనిపై ఏమీ మాట్లాడటం తొందరపాటు అవుతుందని మురళీధర్ అభిప్రాయపడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి హామీ ఇచ్చారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆదేశాల మేరకు దేశంలో వినియోగంలో ఉన్న మొత్తం 33 డ్రీమ్‌లైనర్ విమానాలను క్షుణ్ణంగా తనిఖీ చేశామని ఆయన చెప్పారు. ప్రయాణికులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారని భరోసా ఇచ్చారు. అదే సమయంలో డీజీసీఏలో ఖాళీగా ఉన్న 419 సాంకేతిక సిబ్బంది పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మురళీధర్ వెల్లడించారు. ప్రైవేటు విమానయాన సంస్థలు తమంతట తాముగా నియామకాలు చేపట్టరాదని, డీజీసీఏ అనుమతి తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. ఎక్కువ గంటలు పనిచేయాలంటూ పైలట్లపై ఒత్తిడి తెచ్చే సంస్థల గురించి నేరుగా డీజీసీఏకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు.

# ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు

నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ముందుజాగ్రత్త చర్యగా చార్‌ధామ్ యాత్రను నిలిపివేస్తున్నట్లు గర్వాల్ డివిజన్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే మీడియాకు తెలిపారు. హరిద్వార్, రుషికేశ్, శ్రీనగర్, రుద్రప్రయాగ్, సోన్‌ప్రయాగ్, వికాస్‌నగర్ వంటి కీలక ప్రాంతాల్లో యాత్రికులను సురక్షిత ప్రాంతాల్లో ఆపివేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పరిస్థితులు చక్కబడే వరకు యాత్రికులు ఎక్కడివారు అక్కడే ఉండాలని ఆయన సూచించారు.

**- రహదారుల మూసివేత**

వర్షాల కారణంగా పలు ప్రధాన రహదారులు మూతపడ్డాయి. చమోలీ జిల్లాలోని నందప్రయాగ్ భానర్పానీ వద్ద కొండచరియలు విరిగిపడటంతో బద్రీనాథ్ జాతీయ రహదారిని మూసివేసినట్లు జిల్లా పోలీసులు ప్రకటించారు. యాత్రికులు, స్థానికుల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విపత్తు నిర్వహణ కార్యదర్శి వినోద్ కుమార్ సుమన్ భరోసా ఇచ్చారు. ఈ పరిణామాలపై స్పందించిన ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# టీ బీజేపీ అధ్యక్షుడిగా.. ఏకగ్రీవమే

బీఆర్‌ఎస్‌లతో పోటీ పడేందుకు అనుకూలమైన నాయకత్వం అవసరమని పార్టీ అధిష్టానం భావిస్తోంది. ఒకవైపు బండి సంజయ్ పేరు కూడా గట్టిగా వినిపించినప్పటికీ, ఢిల్లీ నేతలు ఈ విషయంలో గుంభనంగా ఉన్నారు. పార్టీలో ఐక్యత, సమన్వయం, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు, భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుంటున్నారు.

**- ఏకగ్రీవ ఎన్నికకు ప్రాధాన్యం**

బీజేపీ అధిష్టానం ఏకగ్రీవ ఎన్నికకు ప్రాధాన్యం ఇస్తోంది. నామినేషన్ ప్రక్రియలోనే ఢిల్లీ నేతలు కీలక మంత్రాంగం సాగిస్తున్నారు. అధ్యక్ష పదవి కోసం పోటీలో ఉన్న నేతలు చివరి నిమిషంలో తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. జులై 1న కొత్త అధ్యక్షుడి పేరు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ నిర్ణయం పార్టీలో ఐక్యతను, రాష్ట్రంలో రాజకీయ బలాన్ని పెంచే దిశగా ఉంటుందని భావిస్తున్నారు.

**- రాష్ట్రంలో బీజేపీ భవిష్యత్తు**

తెలంగాణలో బీజేపీ బలోపేతం కావాలంటే, సమన్వయ నైపుణ్యం, స్థానిక రాజకీయ డైనమిక్స్‌ను అర్థం చేసుకునే నాయకత్వం కీలకం. ధర్మపురి అర్వింద్ యువ శక్తిని, దూకుడును తెస్తే, ఈటల రాజేందర్ అనుభవం, సమన్వయ నైపుణ్యంతో పార్టీని ఏకతాటిపై నడిపే అవకాశం ఉంది.
స్థానిక సంస్థల ఎన్నికలు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడానికి అధ్యక్షుడి పాత్ర కీలకం. ఢిల్లీ నేతలు ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు.

# తెలంగాణ మహిళలపై ప్రధాని మోదీ ప్రశంసలు

"అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకారం దేశ జనాభాలో 64 శాతానికి పైగా, అంటే దాదాపు 95 కోట్ల మంది ఏదో ఒక సామాజిక భద్రతా పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. 2015 నుండి దేశం ఎంతగానో అభివృద్ధి చెందింది. 2015లో కేవలం 25 కోట్ల మంది మాత్రమే సామాజిక భద్రతను పొందారు." అని పేర్కొన్నారు.

**- ట్రాకోమా రహిత దేశంగా భారత్: డబ్ల్యూహెచ్ఓ**

ప్రధాన ఆరోగ్య విజయాలను సాధిస్తున్నట్లు ప్రధాని మోదీ చెప్పారు. "ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) భారతదేశం ట్రాకోమా నుండి పూర్తిగా విముక్తి పొందినట్లు ప్రకటించింది. ట్రకోమా అనేది శాశ్వత అంధత్వానికి దారితీసే వ్యాధి" అని మన్ కీ బాత్‌లో ప్రస్తావించారు.

**- తెలంగాణ మహిళలపై ప్రధాని మోదీ ప్రశంసలు**

దేశంలో మహిళా సాధికారితపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. తెలంగాణలోని భద్రాచలం ప్రాంతానికి చెందిన మహిళల ప్రయత్నాలను నేటి మన్ కీ బాత్ ప్రసంగంలో ప్రధాని మోదీ హైలైట్ చేశారు: "తెలంగాణలోని భద్రాచలం ప్రాంతానికి చెందిన మహిళలు మిల్లెట్‌లతో బిస్కెట్లు తయారు చేస్తున్నారు. ఆ మిల్లెట్ల బిస్కెట్లు ఎంతో ఆరోగ్యకరమైనవి. అందువల్ల హైదరాబాద్ నుంచి అవి లండన్‌కు కూడా ఎగుమతి అవుతున్నాయి." దాంతో పాటు పర్యావరణ అనుకూల శానిటరీ ఉత్పత్తులను ఉత్పత్తి చేయడంలో వారి కృషిని మెచ్చుకున్నారు. "వారు పర్యావరణ అనుకూల గిరి శానిటరీ ప్యాడ్‌లను తయారు చేస్తున్నారు. కేవలం 3 నెలల్లో ఆ మహిళలు ఏకంగా 40,000 ప్యాడ్‌లను తయారు చేసి విక్రయించారు" అని మోదీ గుర్తుచేశారు.

**-యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం**

యోగాకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతుండటంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. "ఇటీవల అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకున్నాం. యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం అవుతోంది. అనారోగ్య సమస్యలకు యోగా చెక్ పెడుతోంది. శారీరక, మానసిక ఆరోగ్యం యోగా ద్వారా సాధ్యం. యుద్ధాలు సైతం యోగా ద్వారా ఆగిపోతాయని" మోదీ అన్నారు.

**- ఎమర్జెన్సీపై**

భారతదేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పాత రోజులను ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. ఎమర్జెన్సీని వ్యతరికేంచి పోరాడిన వారిని గౌరవించాలని పౌరులకు విజ్ఞప్తి చేశారు. "ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన బాబు జగ్జీవన్ రామ్ వంటి వారిని మనం గుర్తుంచుకోవాలి. రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి అలాంటి వారి పోరాటాలు మనకు స్ఫూర్తినిస్తాయని" అన్నారు.

# నెరవేరిన పసుపు రైతుల చిరకాల కల

బండి సంజయ్ కుమార్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, ఎంపీలు ధర్మపురి అరవింద్, కె లక్ష్మణ్, పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ బోర్డు ఏర్పాటుతో నిజామాబాద్ పసుపుకు వరల్డ్ వైడ్‌గా మరింత ఆదరణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పసుపు బోర్డును తన చేతుల మీదుగా ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు అమిత్ షా చెప్పారు. తెలంగాణ పసుపు రైతుల సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. పసుపు బోర్డు ఏర్పాటు కోసం బీజేపీ ఎంపీలు చేసిన కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. అంతేకాకుండా, ఈ బోర్డుకు చైర్మన్‌గా తెలంగాణ వ్యక్తి అయిన పల్లె గంగారెడ్డిని నియమించడం తమ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని ఆయన వెల్లడించారు.

**- పసుపు ఒక దివ్య ఔషధం**

పసుపు కేవలం ఒక పంట మాత్రమే కాదని, అది ఒక దివ్య ఔషధమని అని అమిత్ షా చెప్పారు. యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియా, యాంటీ క్యాన్సర్ లక్షణాలు ఇందులో ఉన్నాయని ఆయన వివరించారు. 2030 నాటికి ఒక బిలియన్ డాలర్ల విలువైన పసుపును ఎగుమతి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ బోర్డు ద్వారా రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణ ఇస్తామని, ఇక్కడి పసుపు పంటకు జియో ట్యాగింగ్ కూడా చేస్తున్నామని చెప్పారు. భారత్ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా రైతులందరికీ ప్రయోజనం చేకూర్చడానికి కృషి చేస్తున్నామని ఆయన అన్నారు.

# విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

ఇంతవరకు కౌన్సెలింగ్ ప్రారంభించకపోవడం ప్రభుత్వ అసమర్థతకు పరాకాష్ఠ అని విమర్శించారు. ఈసెట్ ఫలితాలు గత నెల మే 15వ తేదీన వెలువడినా, నేటికీ అడ్మిషన్ల ప్రక్రియపై ఎలాంటి షెడ్యూల్ విడుదల చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఎంత దారుణంగా అస్తవ్యస్తంగా మారిందో చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలని ఆయన అన్నారు. నేటి నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులకు తరగతులు ప్రారంభం కానుండగా, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేశారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన "అమాత్యా మేలుకో.. పప్పు నిద్ర వదులు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఈ ఏడాది ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశాల కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 34 వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ పరీక్షకు హాజరుకాగా, వారిలో 31,922 మంది అర్హత సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇంతమంది విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని జగన్ ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి, ఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసి, అడ్మిషన్ల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

# ఫలించిన 60 ఏళ్ల పోరాటం

**- హైడ్రా దర్యాప్తు, ఆక్రమణల నేపథ్యం..**

ఈ భూమి ఆక్రమణకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే 1961లో సాయి సారధినగర్ పేరుతో ఐదు ఎకరాల విస్తీర్ణంలో 35 ప్లాట్లతో ఒక లేఅవుట్ను రూపొందించారు. ఈ లేఅవుట్ ప్లాన్‌లో 1533 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే లేఅవుట్ నిర్మించిన నారాయణ ప్రసాద్ వారసులు ఈ పార్కు స్థలంలో షెడ్డు వేసి ఆక్రమించుకున్నారు. అంతేకాకుండా వ్యవస్థలను ప్రభావితం చేసి, ఇంటి నంబర్ కూడా పొందినట్లు విచారణలో వెల్లడైంది. స్థానికులు పలుమార్లు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినప్పటికీ, 60 ఏళ్లుగా ఈ ఆక్రమణను తొలగించలేకపోయారు. దీంతో సాయి సారధినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో సమగ్ర దర్యాప్తు నిర్వహించి, పార్కు స్థలం ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు.

**హైడ్రా తక్షణ చర్యలు, స్థానికుల ఆనందం..**

ఆదివారం ఉదయం హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగి, పార్కు స్థలంలో ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. ఆ స్థలాన్ని పార్కుగా గుర్తించి, "ప్రొటెక్టెడ్ బై హైడ్రా" అనే బోర్డును ఏర్పాటు చేశారు. దశాబ్దాల తరబడి కొనసాగిన తమ పోరాటం హైడ్రా చొరవతో కేవలం కొద్ది రోజుల్లోనే పరిష్కారమైందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా అధికారులకు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ చర్యతో ఆ ప్రాంతంలో బహిరంగ ప్రదేశాల పరిరక్షణకు, ప్రజల జీవన నాణ్యత మెరుగుదలకు హైడ్రా కట్టుబడి ఉందనడంలో సదేహం లేదు. భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలు జరగకుండా నిరోధించడానికి హైడ్రా నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉంది. స్థానిక ప్రభుత్వాలు, నివాసితుల భాగస్వామ్యంతో పార్కులు, బహిరంగ ప్రదేశాలను అభివృద్ధి చేసి, వాటిని కాపాడటం సమాజ ఆరోగ్యానికి, పచ్చదనానికి అత్యవసరం.

# ఉక్రెయిన్ పై రష్యా అతిపెద్ద గగనతల దాడి

మాస్కో (ప్రశ్న న్యూస్) రష్యా- ఉక్రెయిన్ (దేశాల మధ్య యుద్ధం ఏండ్లుగా కొనసాగుతూనే ఉంది. ఈ యుద్ధంలో రెండు దేశాలు పెద్ద ఎత్తున సైనికులను, పౌరులను కోల్పోయాయి. ఈ నేపథ్యంలోనే రష్యా యుద్ధం మొదలైన నాటి నుంచి గతంలో ఎన్నడూ చేయనంత భారీ స్థాయిలో ఉక్రెయిన్ పై వైమానిక దాడులు చేసింది. శనివారం రాత్రి రష్యా 477 డ్రోన్‌లు, 60 క్షిపణులు ఉన్నాయని ఉక్రెయిన్ వాయుసేన వెల్లడించింది.

వాటిలో 249 డ్రోన్‌లను కూల్చేశామని, మరో 226 డ్రోన్‌లు ఎలక్ట్రానిక్ జామింగ్ వ్యవస్థలవల్ల వాటంతటవే కూలిపోయాయని తెలిపింది. ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ కమ్యూనికేషన్ కమాండర్ యూరీ ఇహ్‌నాట్ మాట్లాడుతూ, శనివారం రాత్రి అతిపెద్ద దాడి జరిగిందని తెలిపారు. ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని రష్యా ఆయుధాలను ప్రయోగించినట్లు ఇహ్‌నాట్ చెప్పారు.

పోలాండ్ గగనతల రక్షణ కోసం మిత్ర దేశాల యుద్ధ విమానాలు రంగంలోకి దిగినట్లు తెలిపారు. ఖెర్సాన్ ప్రావిన్సులో జరిగిన దాడుల్లో ఒకరు మరణించినట్లు అక్కడి గవర్నర్ వెల్లడించారు. కాగా రష్యాలో వేర్పాటువాదాన్ని పశ్చిమ దేశాలు ప్రోత్సహిస్తున్నాయని, ఉక్రెయిన్‌తో చేస్తున్న యుద్ధంలో జోక్యం చేసుకుంటున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆరోపించారు.

# ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ కేంద్రాలుగా ప్రత్యేక జోన్లు

ఛాంబర్స్ ఆఫ్ ఆప్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్ టీసీసీఐ)' ఆధ్వర్యంలో ఆదివారం (జూన్ 29న) నిర్వహించిన 'ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్ పో(ఐఐటీఈఎక్స్) %-% 2025' ముగింపు వేడుకలకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో తెలంగాణ ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్(ఐఐపి) కంపౌండ్ మంత్లీ గ్రోత్ రేటు(సీఎంజిఆర్) 2.9 శాతం. అదే సమయంలో జాతీయ సగటు 0.52 శాతం మాత్రమే. జాతీయ సగటు కన్నా 6 రెట్లు తెలంగాణలో అధికంగా నమోదయింది. 2024-25లో ఇండస్ట్రియల్ గ్రాస్ స్టేట్ వాల్యూ యాడెడ్(జివిఎస్వీఏ) రూ.2.77 లక్షల కోట్లకు చేరింది. ఇంధన వినియోగంలో 15.6 శాతం, జీఎస్టీ వసూళ్లలో 9.8, పే రోల్ ఎన్ రోల్ మెంట్స్ లో 13.9 శాతం వృద్ధి రేటు నమోదైనట్లు' మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు.

**ఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ కేంద్రాలుగా ప్రత్యేక జోన్లు...**

'తెలంగాణ నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ కొందరూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఏడాదిన్నర కాలంలో తమ ప్రభుత్వం రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తెలంగాణకు తీసుకొచ్చింది. ఒక్క లైఫ్ సైన్సెస్ రంగంలోనే రూ.40వేల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. కొత్తగా 150 కొత్త ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. 51వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 1.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ (ఫ్యూచర్ సిటీ), ఏఐ సిటీ, లైఫ్ సైన్సెస్ సిటీ, గ్రీన్ ఇండస్ట్రియల్ కారిడార్స్ డెవలప్ చేస్తున్నాం. పారిశ్రామికాభివృద్ధి వికేంద్రీకరణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అవుటర్ రింగ్ రోడ్డు లోపల టెక్నాలజీ, సర్వీసెస్ జోన్, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య మ్యానుఫాక్చరింగ్ జోన్, ఆర్ఆర్ఆర్ బయట వ్యవసాయ, గ్రామీణ ఇన్నోవేషన్ జోన్ ను ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం' అని శ్రీధర్ బాబు చెప్పారు.

**- మా ఆలోచనలు భవిష్యత్తు తరాల కోసం..**

'మేం అయిదేళ్ల కోసం ప్రణాళికలు రూపొందించడం లేదు. రాబోయే తరాల కోసం ఆలోచిస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2035 నాటికి ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ దిశగానే అడుగులు వేస్తున్నాం. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్య సాధనలో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకొచ్చిన టోనీ బ్లెయిర్ ఇన్స్టిట్యూట్ కు ధన్యవాదాలు. రాష్ట్రాభివృద్ధిలో కలిసొచ్చే వారందర్నీ కలుపుకుని ముందుకెళ్తాం' అని అన్నారు.

**- జీఎస్డీపీలో ఎంఎస్ఎంఈల వాటా 10 శాతానికి పెరిగేలా..**

'సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ)ల బలోపేతంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. గత 18 నెలల్లో కొత్తగా 15వేల ఎంఎస్ఎంఈలు ప్రారంభమయ్యాయి. మన జీఎస్ డీపీలో ఎంఎస్ ఎంఈల వాటాను 10 శాతానికి పెంచేలానే సంకల్పంతో గతేడాది ప్రత్యేక పాలసీకి రూపకల్పన చేశాం. ప్రతి జిల్లా కేంద్రాల్లోనూ ప్రత్యేకంగా ఎంఎస్ ఎంఈ పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. వీటిల్లో మహిళలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యం ఇస్తాం' అని శ్రీధర్ బాబు చెప్పారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఐఐటీఈఎక్స్ 2025 కన్వీనర్ విమలేష్ గుప్తా, ఎఫ్ టీసీసీఐ అధ్యక్షుడు డా.సురేష్ కుమార్ సింఘాల్, సీనియర్ ఉపాధ్యక్షుడు ఆర్. రవి కుమార్, ఉపాధ్యక్షుడు కేకే మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# నిజం గడప దాటేలోగా.. అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది

కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు.

**- తప్పులు రిపీట్ చేయొద్దు!**

గతంలో తాము చేసిన తప్పులు పునరావృతం కాకూడదని చంద్రబాబు గట్టిగా హెచ్చరించారు. నిజం గడప దాటేలోగా అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది, అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. "2014లో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశాం. కానీ, వాటిని ప్రజల్లోకి సరిగా తీసుకెళ్లలేకపోయాం, రాజకీయం మరిచిపోయాం. చాపకింద నీరులా టీడీపీపై అబద్ధాలను ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారు. వివేకానందరెడ్డి హత్యే దీనికి పెద్ద ఉదాహరణ. గుండెపోటు అని మొదట ప్రచారం చేసి, ఆ తర్వాత నాటకాలు ఆడి ప్రజల సానుభూతి పొందారు. కోడికత్తి డ్రామా, ఎన్నికల ముందు గులకరాయి డ్రామా వంటివి వారి కుట్ర రాజకీయాలకు నిదర్శనం. ఇలాంటి దుష్ప్రచారాలను తేలిగ్గా తీసుకోవద్దు. మనం చేస్తున్న మంచిని ఎంత బలంగా వివరిస్తామో, వారి కుట్రలను కూడా అదే స్థాయిలో ప్రజలకు వివరించాలి" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**- ప్రజలకు అందుబాటులో ఉంటే ఆదరిస్తారు.. లేకుంటే టాటా చెప్పేస్తారు**

ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండడం ప్రాముఖ్యతను చంద్రబాబు నొక్కిచెప్పారు. "పనిచేయడం ఒక ఎత్తయితే, జనానికి అందుబాటులో ఉండటం మరో ఎత్తు. ప్రజల్లోకి వెళ్లడానికి ఎలాంటి నామోషీ వద్దు.

చేసిన పనులతో పాటు, చేయలేని పనులకు గల కారణాలను కూడా వివరించాలి. ప్రజలకు ఎంత దగ్గరగా ఉంటే, వారు అంతగా ఆదరిస్తారు. లేదంటే నిర్మొహమాటంగా టాటా చెప్పేస్తారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మన పనితీరు ఉండాలి" అని సూచించారు.

**- ప్రతి ఒక్క ఎమ్మెల్యేతో మాట్లాడతా.. మంచి చెడులు వివరిస్తా**

ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరును తాను నిరంతరం గమనిస్తున్నానని, వివిధ మార్గాల్లో సర్వేలు చేయిస్తున్నానని చంద్రబాబు వెల్లడించారు. "ప్రతి ఎమ్మెల్యేతో త్వరలోనే నేను స్వయంగా సమావేశమవుతాను. ఇప్పటికే నలుగురితో మాట్లాడాను.

వారు చెప్పేది ఓపిగ్గా వింటాను. వారిలో ఏమైనా లోపాలుంటే సరిదిద్దుకోవడానికి సమయం ఇస్తాను. మారితే సంతోషం, లేదంటే నిర్ణయం తీసుకోవడానికి వెనుకాడను. వారసులైనా సరే, కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు ఉంటుంది. పని చేయకుండా పదవులు ఆశిస్తే కుదరదు, వారికో నమస్కారం పెట్టేస్తా" అని చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు.

**- ప్రజలకు జవాబుదారీగా ఉందాం.. పొరపాట్లు ఉంటే సరి చేసుకుందాం**

పాలనలో ఏమైనా లోటుపాట్లు, పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుని ముందుకు సాగుదామని చంద్రబాబు అన్నారు. "ప్రజలు మెచ్చాలి, కార్యకర్తలు ఆమోదించాలి. అదే మన లక్ష్యం. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోవద్దు. డబ్బులు పంచి ఎన్నికల్లో గెలవాలనుకోవడం బాధాకరం. గత ఎన్నికల్లో ప్రత్యర్థులు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసినా 11 సీట్లకే పరిమితమయ్యారు. డబ్బు అన్నివేళలా పనిచేయదు. మనం ఆదర్శవంతమైన రాజకీయాలు చేద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.

**- ప్రభుత్వ కొనసాగింపుతోనే అభివృద్ధి.. కళ్ల ముందున్న వాస్తవమిది**

సుస్థిర ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని చంద్రబాబు అన్నారు. "2004, 2019లో టీడీపీ ఓడిపోవడం వల్ల రాష్ట్రం తిరోగమనం పట్టింది. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింది. ఇప్పుడు మళ్లీ పారిశ్రామికవేత్తలు నమ్మకంతో ముందుకొస్తున్నారు. ఏడాదిలోనే రూ.9.34 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి.

దీని ద్వారా 8.50 లక్షల ఉద్యోగాలు వస్తాయి" అని తెలిపారు. పోలవరం, అమరావతి పనులు వేగవంతం చేశామని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాట పట్టిస్తున్నామని వివరించారు.

**- కార్యకర్తలను మరువొద్దు**

సంక్షేమంలోనూ, అభివృద్ధిలోనూ తమ ప్రభుత్వం ముందుందని చంద్రబాబు పేర్కొన్నారు. "64 లక్షల మందికి పెన్షన్లు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, డీఎస్సీ నోటిఫికేషన్, అన్నా క్యాంటీన్లు వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తాం.
విధానాలు ఎంత బాగున్నా, వాటి అమలులో లోపాలుంటే ప్రయోజనం ఉండదు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో బాధ్యతగా పనిచేయాలి. 2029లో గెలుపే నా ప్రణాళిక. అందుకోసం కష్టపడి పనిచేయడం కాదు, స్మార్ట్‌గా పనిచేయాలి" అని చంద్రబాబు నేతలకు స్పష్టం చేశారు. రాజకీయ ముసుగు వేసుకున్న ఆర్థిక ఉగ్రవాదులు, రౌడీలతో రాష్ట్రానికి ప్రమాదమని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

# బరువు తగ్గేందుకు కేవలం ఫ్రూట్స్ తింటున్నారా

## - అయితే నిపుణులు చెప్పేది వినండి



వేసవి వచ్చిందంటే చాలు, శరీరాన్ని చల్లబరిచే, నోరూరించే పండ్లకు ప్రాధాన్యత పెరిగిపోతుంది. పుచ్చకాయల నుండి మామిడి పండ్ల వరకు, రకరకాల పండ్లు మనల్ని ఆకర్షిస్తాయి. చాలామంది బరువు తగ్గాలనే ఉద్దేశంతో ఎక్కువగా పండ్లనే ఆహారంగా తీసుకుంటారు. పండ్లలో పోషకాలు పుష్కలంగా ఉంటాయన్నది నిజమే అయినా, కేవలం పండ్లనే తింటూ బరువు తగ్గాలనుకోవడం సరైన పద్ధతి కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలా చేయడం వల్ల బరువు తగ్గకపోగా, పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయని స్పష్టం చేస్తున్నారు.

### - పండ్లు మాత్రమే తింటే ఏమవుతుంది?

ప్రముఖ పోషకాహార నిపుణురాలు లవ్‌నీత్ బాత్రా ప్రకారం, రోజంతా కేవలం పండ్లనే ఆహారంగా తీసుకుంటే శరీరంలో గ్లూకోజ్, ఇన్సులిన్ స్థాయుల్లో ఒక్కసారిగా హెచ్చుతగ్గులు వస్తాయట. దీనివల్ల కాలేయం ఎక్కువ కొవ్వును నిల్వ చేసుకుంటుందని, ఆకలిని నియంత్రించే హార్మోన్లు సరిగా పనిచేయవని ఆమె వివరించారు. ఫలితంగా, మాటిమాటికీ ఏదో ఒకటి తినాలనే కోరిక కలుగుతుందని తెలిపారు. పండ్లలో ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెరలు అధికంగా ఉంటాయి. వీటిని ఎక్కువగా తీసుకుంటే, శరీరం ఆ చక్కెరలను కొవ్వుగా మార్చి నిల్వ చేసుకుంటుందని బాత్రా పేర్కొన్నారు. అంతేకాకుండా, పండ్లలో ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు తక్కువగా ఉండటం వల్ల అవి ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచలేవని, దీంతో మరింత ఎక్కువగా తినే అవకాశం ఉంటుందని అన్నారు. పండ్ల రసాలు తాగడం కూడా మంచిది కాదని, వాటిలో చక్కెరలు, కేలరీలు ఎక్కువగా ఉంటాయని, తయారీ ప్రక్రియలో పీచుపదార్థం చాలావరకు పోతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది ఆకలిని నియంత్రించే శక్తిని తగ్గిస్తుంది.

### - బరువు తగ్గాలంటే ఏం చేయాలి?

బరువు తగ్గాలనుకుంటే సమతుల ఆహారం తీసుకోవడమే ఉత్తమ మార్గమని లవ్‌నీత్ బాత్రా సూచిస్తున్నారు. శరీరానికి సూక్ష్మ, స్థూల పోషకాలన్నీ అవసరమని, కేవలం పండ్లు మాత్రమే తినడం పరిష్కారం కాదని స్పష్టం చేశారు. అన్ని ఆహార సమూహాల నుండి పదార్థాలను చేర్చుకోవడం ద్వారా శరీరాన్ని పోషించుకోవాలని, కడుపు ఎక్కువసేపు నిండుగా ఉంచుకోవాలని ఆమె సలహా ఇచ్చారు.

### - పండ్లు తినడానికి సరైన సమయం ఏది?

పండ్ల నుంచి పూర్తి ప్రయోజనాలు పొందాలంటే, వాటిని తినే సమయం కూడా ముఖ్యమేనని గ్లోబల్ హాస్పిటల్స్ ముంబైకి చెందిన కన్సల్టెంట్ డైటీషియన్ డాక్టర్ జమురుద్ పటేల్ తెలిపారు. భోజనం చేసిన వెంటనే పండ్లు తినకూడదని, అలా తింటే అవి సరిగా జీర్ణం కావని, పోషకాలు కూడా శరీరానికి అందవని ఆమె వివరించారు. భోజనానికి, పండ్ల స్నాక్‌కు మధ్య కనీసం 30 నిమిషాల వ్యవధి ఉండాలని సూచించారు. ఉదయం ఒక గ్లాసు నీళ్లు తాగిన తర్వాత ఖాళీ కడుపుతో పండ్లు తినడం ఉత్తమమని ఆమె అన్నారు. ఇలా చేయడం వల్ల శరీరం డిటాక్స్‌పై అవుతుందని, బరువు తగ్గడానికి, ఇతర రోజువారీ పనులకు కావాల్సిన శక్తి లభిస్తుందని తెలిపారు. ఉదయాన్నే, అల్పాహారం-మధ్యాహ్న భోజనం మధ్యలో, సాయంత్రం స్నాక్స్‌గా పండ్లు తీసుకోవడం మంచిదని సూచించారు.

### - బరువు తగ్గడంలో సహాయపడే పండ్లు ఏవి?

**బరువు తగ్గించే ప్రయత్నంలో భాగంగా, కొన్ని రకాల పండ్లను ఆహారంలో చేర్చుకోవచ్చని వెయిట్ లాస్ కన్సల్టెంట్ డాక్టర్ గార్గి శర్మ సిఫార్సు చేస్తున్నారు. అవేంటంటే:**

- పుచ్చకాయ: వంద గ్రాములకు 30 కేలరీలు మాత్రమే ఉంటాయి. నీటిశాతం ఎక్కువగా ఉండటం వల్ల శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది, ఇది కొవ్వు కరగడానికి తోడ్పడుతుంది.
- జామకాయ: పీచుపదార్థం సమృద్ధిగా ఉండి, గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది, జీవక్రియను చురుగ్గా ఉంచుతుంది.
- బేరి పండు: విటమిన్ సి, పీచుపదార్థం ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదిగా జరిగి, ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేస్తుంది.
- నారింజ: పోషకాలు ఎక్కువ, కేలరీలు తక్కువ. పీచుపదార్థం ఆకలిని తగ్గిస్తుంది.
- బ్లూబెర్రీస్: యాంటీఆక్సిడెంట్లు జీవక్రియను పెంచుతాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఇన్సులిన్ రెసిస్టెన్స్, కొలెస్ట్రాల్ తగ్గుతాయి.

కాబట్టి, కేవలం పండ్లతో కూడిన డైట్‌కు మారే ముందు ఈ విషయాలను గుర్తుంచుకోవాలి. పండ్లు పోషకమైనవే అయినప్పటికీ, బరువు తగ్గాలనే లక్ష్యంతో ఉన్నప్పుడు అవి మాత్రమే మీ ఆహారం కాకూడదు. సమతుల పోషణ, సరైన మోతాదులో తినడం, భోజన సమయాలు పాటించడం వంటివి బరువు తగ్గడంలో కీలకపాత్ర పోషిస్తాయి.

(NOTE: ఇంటర్నెట్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు ప్రజాప్రశ్న పత్రిక బాధ్యత వహించదు)

# యజమానిని పొడిచిన ఆవు..
# బురద మడుగులో పడి మృతి



తాను పెంచి పోషిస్తున్న ఆవు తనను పొడిచింది. దాంతో అతడు అదుపు తప్పి పక్కనే ఉన్న బురద మడుగులో పడిపోయాడు. స్థానికులు చూసి అతడిని బయటికి తీసే ప్రయత్నం చేసినా బురదగా ఎక్కువగా ఉండటంతో ఆలస్యం జరిగింది. దాంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హత్రాస్ జిల్లా లోని నగ్లా అనీ గ్రామంలో ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నగ్లా అని గ్రామానికి చెందిన సంతోష్ కుమార్ (55) అనే వ్యక్తికి ఆవులు ఉన్నాయి. వాటిని తన ఇంటి సమీపంలోని ఓ బురద మడుగు దగ్గర వాటిని కట్టేస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సంతోష్ కుమార్ ఆవులను విప్పేందుకు వెళ్లాడు. ఒక ఆవును విప్పి మరో ఆవును విప్పుతుండగా.. అంతకుముందే విడిచిపెట్టిన ఆవు అతడిని పొడిచింది. దాంతో సంతోష్ కుమార్ అదుపుతప్పి బురద మడుగులో పడిపోయాడు. బురద ఎక్కువగా ఉండటంతో అతడికి బయటకు రావడం సాధ్యపడలేదు. స్థానికులు అతడిని బయటికి తీసేందుకు ప్రయత్నించినా బురద కారణంగా రెండు గంటల సమయం పట్టింది. అప్పటికే అతడు మరణించాడు. ఇంతలో అధికారులు, పోలీసులు కూడా ఘటన ప్రాంతానికి చేరుకున్నారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# దేశంలో ఫోన్ ట్యాపింగ్
# మొదలుపెట్టిందే కాంగ్రెస్ పార్టీ

**-ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

హైదరాబాద్ : దేశంలో ఫోన్ ట్యాపింగ్ మొదలుపెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని బీఆర్ఎస్ సీనియర్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ కాంగ్రెస్ మంత్రులు, నాయకులు సిగ్గు లేకుండా ఫోన్ ట్యాపింగ్ అంశం గురించి అడ్డగోలుగా మాట్లాడడం వింతగా ఉందన్నారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ పార్టీలో ఉంటూ కాంగ్రెస్ పార్టీకి వంత పాడే ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ఎవరు పిలవకపోయినా.. నా ఫోన్ ట్యాప్ అయ్యిందని కామెడీ చేస్తున్నాడు. ఈ ఫోన్ ట్యాపింగ్ విచారణ చేస్తారు పోలీస్ అధికారులా? గాంధీ భవన్‌లో ఉండే కాంగ్రెస్ మంత్రులు, యూత్ కాంగ్రెస్ నాయకులా? ఏది వాస్తవమో.. ఏది అవాస్తవమో.. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ప్రెస్‌మీట్ పెట్టి ప్రజలకు తెలియజేయండి అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కుతూ.. హోం మంత్రిగా బాధ్యతగల పదవిలో ఉంటూ సీఎం రేవంత్ ఇస్తున్న ఆదేశాలతో వారి అనుంగు మీడియాతో తప్పుడు రాతలపై, పిచ్చి కూతలు, దొంగ లీకులతో వ్యక్తిగతంగా దాడులు చేస్తున్నారు. మహా టీవీతో పాటు మరికొన్ని వార్తా సంస్థలు, యూట్యూబ్ ఛానెల్లు అడ్డగోలుగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. వారందరిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.

రేవంత్ ఆదేశాలతో మా బీఆర్ఎస్వీ నాయకుడు గెల్లు శ్రీనివాస్‌పై అక్రమ కేసులు బనాయించిన పోలీసులు.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అడ్డగోలుగా, అశ్లీలంగా, జుగుప్సాకరమైన వార్తలు రాసిన మహా టీవీపై తెలంగాణ పోలీసులు సుమోటోగా కేసు పెట్టాలి. నిన్న మా బీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మహా టీవీపై ఫిర్యాదు చేయడానికి వెళ్ళితే.. తొలుత ఫిర్యాదు తీసుకోకపోతే, బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తే అయిష్టంగా పోలీసులు ఫిర్యాదు తీసుకుంటున్నారు అని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా, రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, ప్రజాసమస్యలను కాపాడాల్సిన పోలీసులు. నేడు 80-90 కేసుల నేర చరిత్రతో పాటు ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్‌గా కెమెరాల ముందు దొరికిన ఒక దొంగ మాటలు విని హేయమైన పాత్ర పోషిస్తున్నారు.

# నాంపల్లి నుంచి కన్యాకుమారికి ప్రత్యేక రైళ్లు..
# ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే

రైలు ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. హైదరాబాద్ నుంచి కన్యాకుమారికి ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు వెల్లడించింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని రైళ్లను నడిపించనున్నట్లు పేర్కొంది. ఈ ప్రత్యేక రైళ్లు జులై 2 నుంచి 25వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయని తెలిపింది. హైదరాబాద్-కన్యాకుమారి (07230) రైలు జులై 2 నుంచి 23 వరకు నాలుగు ట్రిప్పులు నడుస్తుందని.. ప్రతి బుధవారం సాయంత్రం 5.20 గంటలకు అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ఈ రైలు నాంపల్లి రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి.. శుక్రవారం వేకువ జామున 2.30 గంటలకు కన్యాకుమారి స్టేషన్‌కు చేరుకుంటుందని చెప్పింది. ఇక కన్యాకుమారి-హైదరాబాద్ (07229) రైలు జులై 4 నుంచి 25 వరకు రాకపోకలు సాగిస్తుందని పేర్కొంది. ప్రతిరోజు శుక్రవారం ఉదయం 5.30 గంటలకు బయలుదేరి.. మరుసటిరోజు సాయంత్రం 2.30 గంటలకు నాంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుందని చెప్పింది. ఈ రైలు రెండు మార్గాల్లో సికింద్రాబాద్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూర్, రేణిగుంట, తిరుపతి, పాకాల, చిత్తూరు, కాట్పడి, తిరువణ్ణామలై, విల్లుపురం, చిదంబరం, మయిలదుతురై, కుంభకోణం, తంజావూర్, తిరుచిరాపల్లి, దిండిగుల్, కొడైకెనాల్, మధురై, విరుదునగర్, సాతూర్, కోవిల్‌పట్టి, తిరునల్వేలి, నాగర్ కోయిల్ స్టేషన్లలో రైలు ఆగుతుందని తెలిపింది. రైలులో సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ క్లాస్ బోగీలు అందుబాటులో ఉన్నాయని.. ప్రయాణికులు రైలును ఉపయోగించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే కోరింది.

# అధికారుల నిర్లక్ష్యంతో స్కాలర్‌షిప్స్‌కు
# మైనారిటీ విద్యార్థులు దూరం

రామవరం : అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న మైనారిటీ విద్యార్థులు ఉపకార వేతనాలకు దూరమవుతున్నారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవడానికి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల విద్యార్థులకు రూ.2 లక్షల ఆదాయ పరిమితి గతంలో ఉండేదన్నారు. కాగా 2022లో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఎస్సీ, ఎస్టీ మాదిరిగా గ్రామీణ ప్రాంతాల్లోని మైనారిటీ విద్యార్థులకు కూడా పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆదాయ పరిమితిని 2 లక్షలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చెయ్యడం జరిగిందన్నారు.

అయినప్పటికీ ఈ-పాస్ పోర్టర్ లో విద్యార్థులు ఉపకార వేతనాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేటప్పుడు రూ.1.50 లక్షల ఆదాయ పరిమితి ఉన్న వారికి ఆన్‌లైన్ స్వీకరించడంలేదని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి పొరపాటును సరిదిద్ది రూ.1.50 లక్షలు ఉన్న ఆదాయ పరిమితిని అర్హులుగా ప్రకటిస్తూ వెంటనే ఈ-పాస్ పోర్టల్ లో మార్పులు చేసి గడువు తేదీని 10 రోజులు పొడిగించాలని కోరారు.

# 'రెండు మూడు నెలల్లో శివకుమార్ సీఎం'..

**కాంగ్రెస్ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు**

బెంగళూరు: కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో త్వరలో మార్పులు జరగనున్నట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే తెలిపారు. రెండు మూడు నెలల్లో డీకే శివకుమార్ (Shivakumar) సీఎం అవుతారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్ఏ ఇక్బాల్ హుస్సేన్ ఆదివారం రామనగరంలో మీడియతో మాట్లాడారు.

ఈ ఏడాది చివర్లో కర్ణాటక ప్రభుత్వంలో నాయకత్వం మార్పు గురించి వస్తున్న ఊహాగానాలపై ఆయన స్పందించారు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ రెండు, మూడు నెలల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉందని తెలిపారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు ఇక్కడి పరిస్థితి గురించి తెలుసని, ఆయనకు అవకాశం ఇవ్వడానికి సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. కాగా, కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కూడా అయిన డీకే శివకుమార్ శ్రమ, కార్యాచరణ, వ్యూహాలు కారణమన్నది అందరికీ తెలుసని ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ గుర్తు చేశారు.

శివకుమార్ సీఎం అవుతారా అని అడిగిన ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానమిచ్చారు. 'అవును, నేను చెబుతున్నా. విప్లవాత్మక రాజకీయ పరిణామాల కోసం కొంతమంది నాయకులు సూచిస్తున్న తేదీ సెప్టెంబర్ తర్వాత జరుగుతుంది. వారు మాట్లాడుతున్నది ఇదే. రెండు మూడు నెలల్లో నిర్ణయం తీసుకుంటారు. డొంక తిరుగుడు కాకుండా నేను నేరుగా చెబుతున్నా' అని అన్నారు.

# రైల్వే ప్రయాణికులకు అలర్ట్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రైలు ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడానికి, ప్రయాణికులకు అనవసరమైన ఆందోళనను తగ్గించడానికి భారతీయ రైల్వే శాఖ కీలక సంస్కరణలను అమలు చేయనుంది. ఇందులో భాగంగా రైలు బయలుదేరడానికి 8 గంటల ముందే ప్రయాణికుల చార్ట్‌ను సిద్ధం చేయాలని రైల్వే బోర్డు ప్రతిపాదించింది. ఈ మార్పులు అమలులోకి వస్తే, వెయిట్‌లిస్ట్ టికెట్లు ఉన్న ప్రయాణికులకు తమ టికెట్ స్టేటస్ గురించి ముందుగానే స్పష్టత లభిస్తుంది.

### వేగవంతమైన నిర్ణయాలకు అవకాశం

కొత్త ప్రతిపాదనలు అమలైతే మధ్యాహ్నం 2 గంటల లోపు బయలుదేరే రైళ్ల కోసం చార్టును అంతకుముందు రోజు రాత్రి 9 గంటలకే తయారు చేస్తారు. దీంతో రిజర్వేషన్ కన్ఫర్మ్ కాని ప్రయాణికులు ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవడానికి, లేదా స్టేషన్‌కు వెళ్లాలా వద్దా అని నిర్ణయించుకోవడానికి తగినంత సమయం దొరుకుతుంది. ప్రస్తుతం రైలు బయలుదేరడానికి కేవలం 4 గంటల ముందు మాత్రమే చార్ట్ సిద్ధం చేస్తున్నారు. ఈ కొత్త పద్ధతి వల్ల మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు, శివారు ప్రాంతాల నుంచి స్టేషన్లకు చేరుకోవాల్సిన వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని రైల్వే బోర్డు పేర్కొంది.

### ఆధునిక ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్

ముందస్తు చార్టుల తయారీతో పాటు, రైల్వేశాఖ అధునాతన ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పిఆర్ఎస్) ను 2025 డిసెంబర్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని కృషి చేస్తోంది. ఈ ప్రాజెక్టును సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (సిఆర్ఐఎస్) సంస్థ అమలు చేయనుంది. ఈ నూతన వ్యవస్థ అమలులోకి వస్తే ఈ కింది ప్రయోజనాలు చేకూరుతాయి. వేగవంతమైన బుకింగ్: ప్రస్తుతం నిమిషానికి 32,000 టికెట్లు బుక్ చేయగలిగే సామర్థ్యం ఉంది. కొత్త వ్యవస్థతో నిమిషానికి 1.5 లక్షలకు పైగా టికెట్లు బుక్ చేసేలా ఐదు రెట్లు పెరుగుతుంది. మెరుగైన ఎంక్వైరీ: ఇక ఇది కొత్త వ్యవస్థ అమలైతే టికెట్ ఎంక్వైరీ సామర్థ్యం నిమిషానికి 4 లక్షల నుంచి 40 లక్షలకు పైగా పెరగనుంది. దీంతో లక్షలాది మంది ప్రయాణికులకు రియల్-టైమ్ బుకింగ్ సమాచారం అందుబాటులోకి వస్తుంది. ఇదిలా ఉండగా ఈ ప్రతిపాదనకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఆమోదం తెలిపారని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దశలవారీగా దీన్ని అమలు చేయాలని ఆదేశించినట్లు రైల్వే బోర్డు తెలిపింది. అయితే, ట్రైన్ బయలుదేరే 5 గంటల ముందు కూడా బుక్ చేసుకునే వారు ఉంటారు. అలాంటి వారికి మాత్రం ఇది బ్యాడ్ న్యూస్ అనే చెప్పాలి.

### తత్కాల్ టికెట్లకు ఆధార్ తప్పనిసరి

మరో ముఖ్యమైన మార్పులో భాగంగా 1 జులై 2025 నుంచి ఆధార్ అథెంటికేషన్ పూర్తి చేసుకున్న వారికి మాత్రమే తత్కాల్ టికెట్లు బుక్ చేసుకునే అవకాశం లభిస్తుంది. టికెట్ల బుకింగ్‌లో జరిగే అక్రమాలను అరికట్టడమే ఈ నిబంధన ప్రధాన ఉద్దేశ్యం. అంతేకాకుండా, జులై నెలాఖరు నుంచి టికెట్ బుకింగ్ సమయంలో ఆధార్ ఓటీపీని కూడా ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఈ చర్యలన్నీ రైల్వే సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చడంలో దోహదపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణలో బీఆర్ఎస్ పోయింది
# కానీ అవినీతి మాత్రం పోలేదు

కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు సమ్మేళనంలో ప్రసంగించిన అమిత్ షా, రైతులకు శుభవార్త చెబుతూనే, విపక్షాలపై రాజకీయ అస్త్రాలు సంధించారు. అదే వేదికపై నుంచి దేశంలోని నక్సలైట్లకు అంతిమ హెచ్చరిక జారీ చేశారు.

### ఢిల్లీకి ఏటీఎంలా తెలంగాణ

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. "ధరణి పోర్టల్, కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ ప్రభుత్వం వేల కోట్ల అవినీతికి పాల్పడింది. మరి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అవినీతిపై ఎందుకు విచారణ జరపడం లేదు? ఎందుకంటే, వాళ్లూ వీళ్లూ దొందూ దొందే. బీఆర్ఎస్ అవినీతిని కాంగ్రెస్ కప్పిపుచ్చుతోంది. తెలంగాణ సొమ్మును ఢిల్లీకి తరలించే ఏటీఎంగా రేవంత్ రెడ్డి సర్కార్ పనిచేస్తోంది" అని ఆయన ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ పాలన పోయి, ఇప్పుడు ఢిల్లీ కుటుంబ పాలన మొదలైందని ఎద్దేవా చేశారు.

### నక్సలిజానికి డెడ్‌లైన్.. 2026 నాటికి అంతం

నక్సలిజంపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని అమిత్ షా స్పష్టం చేశారు. "ఇక సమయం లేదు. 2026 మార్చి 30 నాటికి దేశంలో నక్సలిజం అనే పదాన్ని భూస్థాపితం చేసి తీరుతాం. ఇది మోదీ గ్యారెంటీ" అని ఆయన ప్రకటించారు. "తుపాకులు పక్కనపెట్టి, హత్యలు ఆపి జనజీవన స్రవంతిలో కలవండి. లేదంటే, కఠిన చర్యలు తప్పవు" అని నక్సలైట్లకు తీవ్ర హెచ్చరికలు పంపారు. ఉగ్రవాదాన్ని ఎలాగైతే అణచివేశామో, నక్సలిజాన్ని కూడా కూకటివేళ్లతో పెకిలిస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

### రైతులకు 'పసుపు' కానుక

40 ఏళ్ల నిజామాబాద్ రైతుల పోరాటానికి ప్రధాని మోదీ ప్రభుత్వం ముగింపు పలికిందని అమిత్ షా అన్నారు. ఎంపీగా గెలిస్తే పసుపు బోర్డు తెస్తానని హామీ ఇచ్చిన ధర్మపురి అర్వింద్, మాట నిలబెట్టుకున్నారని ప్రశంసించారు. "మోదీ ఏది చెబితే అది చేస్తారు. ఈ బోర్డుతో పాటు, భారత్ ఆర్గానిక్, భారత్ ఎక్స్‌పోర్ట్ సంస్థలను కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నాం. ఇకపై నిజామాబాద్ పసుపు ప్రపంచవ్యాప్తంగా తన ఖ్యాతిని చాటుతుంది. రైతుల ఆదాయం రెట్టింపు అవుతుంది" అని ఆయన భరోసా ఇచ్చారు.

# జూబ్లీహిల్స్ బైపోల్ వేళ
# కీలక పరిణామాలు

మారుతోంది.

### - సీటు కోసం పోటీ

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పై ప్రధాన పార్టీలో ఫోకస్ పెట్టాయి. మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యమైంది. నవంబర్ లో కేంద్ర ఎన్నికల సంఘం ఉపఎన్నికను పూర్తి చేయనుంది. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన కంటోన్మెంట్ ఉపపోరులో విజయాన్ని ఈ ఎన్నికలోనూ పునరావృతం చేయాలని భావిస్తోంది. కాంగ్రెస్ నుంచి ఈ సారి ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు పెద్ద సంఖ్యలో ఆశావాహులు రేసులో ఉన్నారు. 2023లో ఇదే స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలైన అజారుద్దీన్, తిరిగి తనకే టికెట్ ఇస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. అయితే, సీఎం రేవంత్ మాత్రం అభ్యర్థి ఎవరనేది హైకమాండ్ నిర్ణయిస్తుందని చెబుతున్నారు. కాగా, ఇక్కడ ఎంఐఎం పోటీ గెలుపు ఓటముల్లో కీలకంగా మారనుంది.

### రేవంత్ ఛాయిస్

అధికారంలో ఉన్న కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, ఫయీమ్ ఖురేషి, రాములు నాయక్, అంజన్ కుమార్ యాదవ్, మైనంపల్లి హనుమంతరావు, బండి రమేశ్, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఖైరతాబాద్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన పీజేఆర్ కుమార్తె విజయా రెడ్డి పోటీకి సిద్ధమంటూ పీసీసీకి సంకేతాలు పంపిస్తు న్నారు. అటు బీఆర్ఎస్ కు ఈ ఉప ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారుతోంది.

అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాల్లో ఫలితాలు ప్రతికూలంగా వచ్చినప్పటికీ, హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మాత్రం అనుకూల ఫలితాలు వచ్చాయి. అనారోగ్యంతో మరణించిన మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ నుంచి వరుసగా మూడుసార్లు 2014, 2018, 2023 ఎన్నికల్లో విజయం సాధించారు. మొదట తెలుగుదేశం పార్టీ నుంచి గెలుపొందిన ఆయన, తర్వాత గులాబీ పార్టీలో విలీనమై పోటీ చేసి గెలుపొందారు.

### బీఆర్ఎస్ అభ్యర్థిగా

ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ తమ అభ్యర్థిగా గోపీనాథ్ కుటుంబ సభ్యులను బరిలోకి దించాలని దాదాపు నిర్ణయానికి వచ్చింది. ఇప్పటికే ఈ మేరకు చర్చలు చేసినట్లు తెలుస్తోంది. రాజధానిలో బీఆర్ఎస్ బలంగా ఉందని, ప్రజల నుంచి పూర్తి మద్దతు ఉంటుందని బీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో జరుగుతున్న ఉప ఎన్నికలో పార్టీ అభర్థిని గెలిపించుకోవడం గులాబీ పార్టీకి అవసరంగా మారుతోంది. మాగంటి కుటుంబానికి పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కుటుంబానికి మంచి సంబంధాలు ఉన్నాయి.

ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, దాసోజు శ్రవణ్‌లకు నియోజకవర్గ సమన్వయ బాధ్యతలను అప్పగించారు. మాగంటి సతీమణి సునీత పార్టీ సభలకు హాజరవుతున్నారు. అటు బీజేపీ సైతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై గురి పెట్టినట్లు తెలుస్తోంది. టీడీపీ, జనసేన మద్దతు ఇక్కడ తీసుకునేలా బీజేపీ నేతలు ప్రయత్నం చేస్తున్నారు. దీంతో, జూబ్లీహిల్స్ బై పోల్ ఇప్పుడు ఆసక్తి కరంగా మారుతోంది.

## క్యాబిన్‌లో కాలిన వాసన.. వెనుదిరిగిన ఎయిరిండియా విమానం..!



ఈ మధ్య కాలంలో ఎయిరిండియా విమానాల్లో తరచూ సమస్యలు వెలుగు చూస్తున్నాయి. ఇటీవల అహ్మదాబాద్ లో ఎయిరిండియాకు చెందిన AI-171 విమానం కుప్పకూలి 279 మంది మరణించినప్పటి నుంచి తరచూ లోపాలు వెలుగుచూస్తున్నాయి. తాజాగా మహారాష్ట్ర రాజధాని ముంబై నుంచి తమిళనాడు రాజధాని చెన్నై కి బయలుదేరిన ఎయిరిండియా విమానంలో సమస్య తలెత్తింది. శనివారం రాత్రి 10.55 గంటలకు AI-639 విమానం ముంబై నుంచి చెన్నైకి బయలుదేరింది. ఆ తర్వాత కాసేపటికే క్యాబిన్‌లో కాలిన వాసన రావడంతో పైలట్ ఆ విమానాన్ని వెనక్కి తీసుకొచ్చి ముంబైలోనే దించాడు. అనంతరం ఎయిరిండియా అధికారులు మరో విమానంలో ప్రయాణికులను చెన్నైకి పంపించారు. ఈ విషయాన్ని ఎయిరిండియా అధికార ప్రతినిధి మీడియాకు వెల్లడించారు. ప్రయాణికులు, సిబ్బంది క్షేమమే తమ సంస్థ తొలి ప్రాధాన్యమని ఆయన చెప్పారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపారు.

## పెళ్లి కోసం ఆరాటపడిన వ్యక్తి.. పెళ్లైన కొన్ని రోజులకే హత్య చేసిన నవ వధువు



లక్నో: ఒక వ్యక్తి పెళ్లి కోసం తెగ ఆరాటపడ్డాడు. రైతు అయిన తనను పెళ్లి చేసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని ఆధ్యాత్మిక కార్యక్రమంలో వాపోయాడు. ఈ వీడియో వైరల్ కావడంతో ఒక మహిళ అతడ్ని ట్రాప్ చేసి పెళ్లి చేసుకున్నది. కొన్ని రోజులకే ఆ వ్యక్తిని హత్య చేసి డబ్బు, నగలతో పారిపోయింది. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జిల్లా పద్వార్ (ఖిటోలా) గ్రామానికి చెందిన 45 ఏళ్ల ఇంద్రకుమార్ తివారీ వ్యవసాయంతోపాటు పార్ట్ టైమ్ టీచర్‌గా పని చేస్తున్నాడు. కాగా, మేలో జరిగిన గురు అనిరుద్ధాచార్య మహారాజ్ ఆధ్యాత్మిక ప్రసంగం కార్యక్రమంలో ఇంద్రకుమార్ పాల్గొన్నాడు. 18 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ తనకు పెళ్లి కావడం లేదని, వధువు దొరకడం లేదని, తనను, తన ఆస్తిని చూసుకునేందుకు ఎవరూ లేరంటూ అనిరుద్ధాచార్య ఎదుట వాపోయాడు. ఇది విని అక్కడున్న వారంతా నవ్వుకున్నారు. మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఇంద్రకుమార్ భూమిని కాజేసేందుకు ఒక ముఠా అతడ్ని ట్రాప్ చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన సాహిబా బానో అనే మహిళ 'ఖుషి తివారీ' పేరుతో సోషల్ మీడియాలో పరిచయమైంది. అతడ్ని పెళ్లి చేసుకుంటానని నమ్మించింది. కుషినగర్‌కు రావాలని చెప్పింది.

## మధిరలో డిప్యూటీ సీఎం షాడోల పరిపాలన

**- లింగాల కమల్‌రాజు**



బోనకల్లు : మధిరలో డిప్యూటీ సీఎం షాడోలు పరిపాలన చేస్తున్నారని ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. ఆదివారం బోనకల్లు మండలం రావినూతల గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి 19 నెలలు అయినప్పటికీ ప్రజలకు ఒరిగిన ప్రయోజనం శూన్యం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే 90 రోజుల్లో 420 హామీలు అమలు చేస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. ఈ హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, విమర్శించినా వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంట్లో రాసిచ్చిన స్క్రిప్ట్ ఆధారంగా మహా టీవీ కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులపై వ్యక్తిగతంగా ఆరోపణ చేస్తూ ప్రచారం చేయడం దారుణం అన్నారు. వీటిని తిప్పికొట్టేందుకు వ్యవహరిస్తున్న సోషల్ మీడియాపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారన్నారు. పోలీస్ అధికారులు వాస్తవాలను పరిశీలించి కేసులు నమోదు చేయాలే తప్పా కాంగ్రెస్ నాయకులు చెప్పారు కదా అని కేసు నమోదు చేస్తే రాబోవు రోజుల్లో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు, మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ బానోత్ కొండ, రైతు బంధు మాజీ కన్వీనర్ వేమూరు ప్రసాద్, నాయకులు గద్దల వెంకటేశ్వర్లు, పారా ప్రసాద్, జెర్రిపోతుల రవీందర్, వంగాల కృష్ణ, గొల్లమందల రాజారావు, ఏడుకొండలు, అనంతరామయ్య పాల్గొన్నారు.

## మహిళను చంపి.. గోనె సంచిలో కుక్కి.. చెత్త లారీలో మృతదేహం..!



ఓ గుర్తు తెలియని మహిళను చంపి, గోనె సంచి లో కుక్కి, చెత్త లారీ లో పడేశారు. కర్ణాటక రాజధాని బెంగళూరు లో ఆదివారం ఉదయం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలను జల్లెడ పడుతున్నారు. ఒక వ్యక్తి ఆటోలో వచ్చి, గోనెసంచిని చెత్త లారీలో వేసిన దృశ్యాలు ఓ సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఆ ఫుటేజ్ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నారు. కొన్ని వారాల క్రితం బెంగళూరులోనే ఇద్దరు పిల్లల తల్లి అయిన మహిళను ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తి దారుణంగా చంపేశాడు. ఆ ఘటనను మరువకముందే తాజాగా ఈ ఘటన చోటుచేసుకోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

# పూరీలో తొక్కిసలాట.. డీఎం, ఎస్పీపై బదిలీ వేటు వేసిన ప్రభుత్వం..!



పూరీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసింది. నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు అధికారులపై సీఎం మోహన్ చరణ్ మాఝీ కఠిన చర్యలు తీసుకున్నారు. పూరీ జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్పీని బదిలీ చేశారు. ఈ మేరకు సీఎంవో ఓ ప్రకటన విడుదల చేసింది. పూరీ కలెక్టర్ సిద్ధార్థ్ శంకర్ స్వైన్, ఎస్పీ వినీత్ అగర్వాల్‌లపై బదిలీ వేటు వేసింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు డీసీపీ విష్ణు పాటి, కమాండెంట్ అజయ్ పాధిలను సస్పెండ్ చేశారు. పూరి జిల్లా కొత్త కలెక్టర్‌గా చంచల్ రాణాను, కొత్త ఎస్పీగా పినాక్ మిశ్రాను ప్రభుత్వం నియమించింది. డెవలప్‌మెంట్ కమిషనర్ పర్యవేక్షణలో ఘటనపై విచారణకు సీఎం మాఝీ ఆదేశించారు. మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని ఆదేశించారు. మరణించిన ప్రతి భక్తుడి కుటుంబాలకు రూ.25 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు సీఎం ప్రకటించారు. డెవలప్‌మెంట్ కమిషనర్ పర్యవేక్షణలో వివరణాత్మక పరిపాలనా విచారణకు సీఎం ఆదేశించారు. దాంతో పాటు ఈ సంఘటనకు ముఖ్యమంత్రి భక్తులందరికీ క్షమాపణలు చెప్పారు. జగన్నాథ భక్తులందరికీ ప్రభుత్వం తరపున క్షమాపణలు చెబున్నానన్నారు.

ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భక్తుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదం నుంచి కోలుకునే శక్తిని ప్రసాదించాలని దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. ఇదిలా ఉండగా.. పూరీలోని గుండిచా ఆలయ సమీపంలో ఆదివారం ఉదయం తొక్కిసలాట జరగడంతో ముగ్గురు భక్తులు మరణించగా.. మరో 50 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. మృతులను బోలాఘర్ నివాసి బసంతి సాహు, బలిపట్న నివాసితులు ప్రేమకాంత్ మొహంతి, ప్రవతి దాస్‌గా గుర్తించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పంపారు. ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

## పెండెం జగదీశ్వర్ సాహిత్య సేవ చిరస్మరణీయం

**- గరిపెల్లి అశోక్**



రామగిరి: బాల సాహితీ రత్న పెండెం జగదీశ్వర్ బాల సాహిత్యానికి చేసిన కృషి చిరస్మరణీయమని ప్రముఖ బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్ అన్నారు. నల్లగొండ ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అధ్యక్షతన జరిగిన పెండెం జగదీశ్వర్ స్మారక ఆరవ జాతీయ పురస్కార ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పెండెం జగదీశ్వర్ సాహిత్యాన్ని ప్రతి పాఠశాలకు చేర్చవలసిన బాధ్యత ప్రభుత్వానికి, సమాజానికి ఉందన్నారు. జగదీశ్వర్ స్మారక జాతీయ పురస్కారాన్ని విజయవాడకు చెందిన ప్రముఖ బాల సాహితీవేత్త శ్రీమతి ముంజలూరి కృష్ణకుమారికి అందజేశారు. ఈ పురస్కారం కింద ఐదు వేల రూపాయల నగదు, శాలువా ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించారు. పురస్కార గ్రహీత ముంజులూరి కృష్ణకుమారి మాట్లాడుతూ.. జగదీశ్వర్ పేరిట వారి స్నేహితులు పురస్కారాన్ని ఏర్పాటు చేసి జాతీయ స్థాయిలో బాల సాహిత్యంలో విశిష్ట కృషి చేసిన రచయితలకు అందజేస్తుండడం అభినందనీయం అన్నారు. అకాడమీ పురస్కారం కంటే ఈ పురస్కారం గొప్పదని ప్రశంసించారు. ప్రముఖ కథా రచయిత మేరెడ్డి యాదగిరి రెడ్డి మాట్లాడుతూ.. జగదీశ్వర్ మరణం బాల సాహిత్యానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితీ జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, సృజన సాహితీ అధ్యక్ష కార్యదర్శులు పెరుమాళ్ల ఆనంద్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, రచయితలు పుప్పాల కృష్ణమూర్తి, డాక్టర్ పగడాల నాగేందర్, డాక్టర్ ఉప్పల పద్మ, పెందోట సోము, దాసోజు శ్రీనివాస్, శంకర్, బాసరాజు యాదగిరి, బండారు శంకర్, శ్రవణ్ కుమార్, భీమార్జున్ రెడ్డి, మాదగాని శంకరయ్య, మోత్కూరు శ్రీనివాస్, వడ్డేపల్లి వెంకటేశ్, ముక్కామల జానకిరామ్ పాల్గొన్నారు.

## మహా టీవీపై చర్యలు తీసుకోవాలి

**- దిండిగాల రాజేందర్**



ఇల్లెందు, జూన్ 29 : ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కొన్ని రోజుల నుండి తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్న మహా టీవీ న్యూస్ ఛానల్ తీరును ఖండిస్తూ బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో ఇల్లెందు పట్టణ ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులతో కలిసి కొత్త బస్టాండ్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి మహా న్యూస్ ఛానల్‌కు వ్యతిరేక నినాదాలు చేశారు. బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం దిండిగాల రాజేందర్, సిలివేరి సత్యనారాయణ, టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ రంగనాథ్ మాట్లాడుతూ.. ఫోన్ టాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొందరు నాయకులతో చేతులు కలిపిన మహా టీవీ బీఆర్ఎస్ పార్టీపైన, పార్టీ కీలక నేతలపైన అడ్డగోలుగా అసత్య వార్తలను దుష్ప్రచారం చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు.

మహా టీవీ న్యూస్ ఛానల్ తన యూట్యూబ్ ఛానల్ లో తప్పుడు థంబ్ నెయిల్స్ పెట్టి బీఆర్ఎస్ పార్టీ కీలక నాయకులపై వ్యక్తిగత దూషణలు, అవమానకరమైన కథనాలను సృష్టించడం నీచమైన చర్యగా అభివర్ణించారు. ఆంధ్ర పత్రికలు, టీవీల టార్గెట్ కేవలం కేసీఆర్ ఫ్యామిలీ మాత్రమేనని తెలిపారు. అందుకే కేవలం బీఆర్ఎస్ పార్టీ నాయకులకు మాత్రమే అప్రతిష్ట తీసుకొచ్చేందుకు ప్రత్యేకంగా రూపొందించిన తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నట్లు వారు దుయ్యబట్టారు.

ఈ కార్యక్రమంలో పార్టీ ఇల్లెందు పట్టణ నాయకులు %ఁ% 11వ వార్డు మాజీ కౌన్సిలర్ జె కె శ్రీను, పట్టణ మహిళ ప్రధాన కార్యదర్శి కోక్కు సరిత, పట్టణ ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, యువజన విభాగం గిన్నారపు రాజేశ్, సత్తాల హరికృష్ణ, కాసాని హరిప్రసాద్ యాదవ్, ఎంటెక్ మహేందర్, మండల ఉపాధ్యక్షుడు దేరంగుల పోశం, పట్టణ యువజన నాయకులు తోటకూర శ్రీకాంత్, సన రాజేశ్, ఎస్.కె చాంద్ పాషా, మునిగంటి శివ, రామ్ లాల్ పాసి, పరికపెల్లి రవి, కొండూరు రవికాంత్, గడ్డి శ్రీను, మీరజ్ బేగ్, షేక్ రసూల్, బజారు సత్యనారాయణ, ఈదుల ముత్తయ్య, ఆటో యూనియన్ నాయకులు సముద్రాల తిరుమలరావు, ఎస్.కె పాస్సి, పోషాలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో పొంగిపొర్లుతున్న మురుగునీరు.. పట్టించుకోని అధికారులు



కొండాపూర్: డ్రైనేజీ సమస్యలను పరిష్కరించే శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలోనే మురుగు పరుగులు తీస్తుంది. గత వారం రోజులుగా మురుగు నీరు రోడ్డుపై పారుతున్న అధికారులు పట్టించుకోక పోవడంపై కార్యాలయానికి విచ్చేసి సందర్శకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జోనల్ పరిధిలోని సమస్యలను పరిష్కరించే అధికార యంత్రాంగం కొలువుదీరే కార్యాలయంలో సమస్యను పరిష్కరించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆఫీస్ నే పట్టించుకొని అధికారులు ప్రజల సమస్యలను పట్టించుకుంటారా అంటూ పెదవి విరుస్తున్నారు. అధికారులు ఇకనైనా డ్రైనేజీ సమస్యను పరిష్కరించి పరిష్కారం చూపాలంటూ ప్రజలు కోరుతున్నారు.

## మొక్కలు నాటిన ఇథనాల్ కంపెనీ సిబ్బంది



మరికల్: మరికల్ మండలంలోని చిత్తనూర్ ఆగ్రో ఇండస్ట్రీస్, ఆగ్రో ఫార్మ్స్ అధినేత మోహన్ రావు జ్ఞాపకార్థం ఆదివారం మరికల్ మండలం చిత్తనూర్ జూరాల ఇథనాల్ కంపెనీ ఆవరణలో పదివేల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకై పదివేల మొక్కలు నాటామన్నారు. మోహన్ రావు జ్ఞాపకార్థం మొక్కలను నాటడంతోపాటు వాటిని సంరక్షిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో తమ వంతు కృషిగా మొక్కలను పెంచుతున్నామని తెలిపారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జూరాల ఇత్తనాలు కంపెనీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## తొక్కిసలాట మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం..

**ప్రకటించిన ఒడిశా సీఎం**



పూరీ జగన్నాథస్వామి రథయాత్ర లో జరిగిన తొక్కిసలాట మృతులకు ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ యాదవ్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున చెల్లించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఒడిశా సీఎంవో ప్రెస్ నోట్ రిలీజ్ చేసింది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పూరీ జగన్నాథ రథయాత్రను తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో దురదృష్టవశాత్తు తొక్కిసలాట జరిగిందని సీఎం వెల్లడించారు. ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించినట్లు తెలిపారు. రథయాత్రలో అపశృతి చోటుచేసుకున్నందుకు ఒడిశా సీఎం భక్తులకు క్షమాపణలు చెప్పారు. కాగా తొక్కిసలాటలో మొత్తం ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. పలువురికి గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో తొక్కిసలాటకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం మోహన్ చరణ్ అధికారులను ఆదేశించారు.

# గూండ్ల గంగపుత్ర మత్స్యకారుల సంఘం అధ్యక్షుడిగా ఎల్లా ముత్తన్నా

**ఏకగ్రీవంగా ఎన్నికైన ముత్తన్న**

**కొత్త కార్యవర్గాన్ని ప్రకటించిన నూతన అధ్యక్షుడు**

**గంగపుత్ర మత్స్యకారుల కోసం కృషి చేస్తానని స్పష్టం**




అంబర్ పేట (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర గూండ్ల మత్స్యకారుల సంఘం అధ్యక్షునిగా ఏల్లా ముత్తన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంబర్‌పేట, అన్నపూర్ణ నగర్, లో గల సంఘ భవనంలో జరిగిన సర్వ సభ్య సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గత సంవత్సర ఆర్థిక లావాదేవీలపై చర్చలు నిర్వహించిన అనంతరం, సంఘానికి ఎన్నికలు నిర్వహించారు. ఇందులో భాగంగానే ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత లైబ్రేరియన్ ఎల్లా ముత్తన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన అధ్యక్షునిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.గత బీఆర్ఎస్ సర్కారులో వచ్చిన వివాదాస్పద జీఓ నెంబర్ 6పై నిరంతరాయంగా పోరాటాలు చేసినట్లు, క్రమంగా గంగపుత్రులను చైతన్య పరుస్తున్నట్లు ముత్తన్న స్పష్టం చేశారు. గంగపుత్ర ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కావూరి వెంకటేష్ ఆధ్వర్యంలో పూస నర్సయ్యతో కలిసి తాను అనేక గ్రామాలు సందర్శించి గంగపుత్రుల స్థితగతులను స్వయంగా పరిశీలించినట్లు ముత్తన్నా చెప్పారు. గంగపుత్రుల ఐక్య వేదిక సంఘం మార్గదర్శకంలో జాతి నిర్మాణానికి కృషి చేయయడమే కాకుండా గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం వేసిన కమిటీలో తాను కూడా సభ్యుడిగా ఉన్నట్లు ఎల్లా ముత్తన్న గుర్తు చేశారు. కార్యక్రమంలో కార్య నిర్వాహక అధ్యక్షుడు వై.శ్రీనివాస్ , ఉపాధ్యక్షులు వై. ముత్తన్న, వీ. గంగాధర్, బీ. పోచయ్య , ఏ. జలంధర్, వై. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పి. ప్రసాద్, అదనపు ప్రధాన కార్యదర్శి కే. ప్రమోద్, జాయింట్ సెక్రటరీగా ఏ. రాజేశ్వర్, జే. అశోక్ పోస్టాఫీస్, రాజేశ్, రజినీకాంత్ , కే. ముకేశ్ రవి బొగ్గుల, ఆర్గనైజింగ్ సెక్రెటరీస్ గా ఎం. చంద్రశేఖర్ పీ. క్రిష్ణ, ఈ. యాదగిరి వై. ప్రవీణ్ కుమార్ ఎల్. రాము చేగూరి శ్రీనివాస్, కోశాధికారి పి. నర్సింగ్ రావు, సహాయ కోశాధికారి. వై. శేఖర్, కార్యవర్గ సభ్యులు వై. గణేశ్, దేవేందర్ , రాకేశ్ తదితర కార్యవర్గాన్ని నూతన అధ్యక్షుడు ముత్తన్న ప్రకటించారు.

## హిందీని రుద్దడంతో 90,000 మంది విద్యార్థులు ఫెయిల్: తమిళనాడు మంత్రి

చెన్నై: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న భాషా విధానం, విద్యా నిధులపై తమిళనాడు (Tamil Nadu) విద్యా శాఖ మంత్రి అన్బిల్ మహేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందీని బలవంతంగా రుద్దడం వల్ల బోర్డు పరీక్షల్లో 90,000 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని ఆరోపించారు. శుక్రవారం ఒక ప్రభుత్వ స్కూల్‌లో జరిగిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి విద్యా శాఖ మంత్రి అన్బిల్ మహేష్ మాట్లాడారు. ఒక భాష (హిందీ)ను బలవంతంగా రుద్దడం వల్ల కర్ణాటకలోని బోర్డు పరీక్షల్లో 90,000 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ భాషా విధానంపై ఆయన మండిపడ్డారు. 'మూడవ భాష తప్పనిసరి కాదు. ఒక ఎంపికగా ఉండాలి' అని అన్నారు.కాగా, విద్యా రంగంలో రాణించిన తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలకు కీలకమైన విద్యా నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిందని మంత్రి అన్బిల్ మహేష్ ఆరోపించారు. 'కేంద్రం విద్యా నిధులను నిలిపివేయడం ద్వారా రాష్ట్రాలను బెదిరిస్తోంది. కానీ ముఖ్యమంత్రి స్టాలిన్ జోక్యం చేసుకున్నారు. పూర్తి ఖర్చును రాష్ట్రం భరిస్తుందని హామీ ఇచ్చారు' అని ఆయన అన్నారు.

కేటీఆర్‌పై దుష్ప్రచారం మానుకోవాలి : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య జర్నలిజం ముసుగులో కొన్ని మీడియా సంస్థలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విషం చిమ్ముతూ, వ్యక్తిత్వ హననం చేయడం మానుకోవాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు.

## కేటీఆర్‌పై దుష్ప్రచారం మానుకోవాలి

**– మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**



రామన్నపేట : జర్నలిజం ముసుగులో కొన్ని మీడియా సంస్థలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విషం చిమ్ముతూ, వ్యక్తిత్వ హననం చేయడం మానుకోవాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఆదివారం రామన్నపేట మండలంలోని జనంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రేఖ యాదయ్య తండ్రి బుగ్గయ్య అనారోగ్యంతో మృతి చెందగా మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. దురుద్దేశంతో తప్పుడు వార్తలు ప్రసారం చేయడం జర్నలిజం కాదన్నారు. జర్నలిజం ముసుగులో వ్యక్తిగతంగా విషం చిమ్మడం దుర్మార్గమన్నారు. దురుద్దేశపూర్వకంగా కేటీఆర్‌పై అసత్య వార్తలు ప్రచారం చేసిన ఛానల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోశపోయిన మల్లేశం, రైతు సమన్వయ సమితి మాజీ మండలాధ్యక్షుడు బొక్క చూదవరెడ్డి. నాయకులు కన్నెబోయిన బలరాం, జెట్టి సైదులు, నడిగోటి కృష్ణ, వంగాల యాదయ్య, నక్క సరేందర్, సింగం మల్లేశం, వల్ల సైదులు పాల్గొన్నారు.

## తండ్రి బాటలో తనయుడు, డివిజన్లో "ఢీ"అంటే "ఢీ"

దేశంలో రాజకీయ వారసత్వం

వార్డు మెంబర్ నుంచి వివిధ హోదాల్లో ఉన్న వారసులు

సమాజంలో కొక్కోలలు.

ప్రాంతీయ,జాతీయ జెండా కింద వారసుల హవా.

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) దేశంలో వారసుల రాజకీయం సూపర్ మ్యాన్ లా దూసుకుపోతోంది అనడానికి ప్రాంతీయ,జాతీయ పార్టీల కీలక నాయకుల వారసులను చూస్తే అర్థమవుతుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి మొదలైన వారసత్వ రాజకీయా అరంగ్రేటం.కానీ అప్పటికి ఇప్పటికి తేడా ఏమిటి.? అప్పటి రాజకీయం అందరికోసం,ఇప్పటి రాజకీయం అధికారం కోసం. అలాగని అందరి రాజకీయ నాయకుల వారసులు ఒకేలా ఉండరు.ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎర్రంనాయుడు ఓ మహా నేత ఆయన్ని శ్రీకాకుళం జిల్లా ప్రజలు చాలా గౌరవిస్తారు. తండ్రి బాటలో తనయుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు తండ్రి మరణం తర్వాత రాజకీయంలో ఒక్కోక్క మెట్టు ఎక్కుతూ, ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వంలో పౌరవిమానాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన రామ్మోహన్ నాయుడు.ఇదేబాటలో పలు కీలక పదవుల్లో సీనియర్ల తనయులు ఉన్నారు.అయితే హైదరాబాద్ మహానగరంలో వివిధ పార్టీల నేతల వారసులు ప్రజల మధ్యలో ఉంటూ వారి బాగోగులు చూసుకుంటూ తండ్రికి బాసటగా నిలిచారు.ఈ నేపథ్యంలో కూకట్పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయిన్ పిల్లి డివిజన్ లో ముద్దం నర్సింహా యాదవ్ జిహెచ్ఎంసి ఎన్నికల్లో మూడు పర్యాయాలు గెలిచి,అలాగే రాబోయే ఎన్నికల్లో "సూపర్ ఫోర్"కొట్టాలని ఆశిస్తున్నాడు. అదిగాక తన వారసుడు ముద్దం మల్లికార్జున్ యాదవ్ తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ తన తండ్రి గెలుపు కోసం ప్రజల మధ్యలో ఉండడానికి కారణం జిహెచ్ఎంసి పరిధిలో అత్యధిక మెజారిటీ దేవుడు లాంటి తండ్రికి రావాలనే ఆలోచనతో ప్రతి కార్యక్రమంలో ఉంటున్నానని ముద్దం మల్లికార్జున్ యాదవ్ బోయిన్ పల్లి డివిజన్ అస్మత్ పేట మెయిన్ రోడ్ లైన్స్ టౌన్ కాలనీలో నల్ల పోచమ్మ దేవాలయంలో సామాజిక భవనం నిర్మాణం కోసం స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ సొంత నిధులతో కమ్యూనిటీ హాలు పైకప్పు నిర్మాణ పనులు ప్రారంభించారు.ఆ సమయంలో ఆయన మనస్సు లో మాట బహిర్గతం చేశారు ముద్దం మల్లికార్జున్ యాదవ్.







## ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన కారు, నలుగురికి గాయాలు అతివేగంతో వచ్చిన కారు అదుపుతప్పి



బీబీనగర్ : అతివేగంతో వచ్చిన కారు అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన చెమన్‌సింగ్ ఆదివారం ఉదయం తన కారులో బీబీనగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామం వైపునకు వెళ్తున్నాడు. గ్రామ సమీపంలోకి చేరుకోగానే కారు అదుపుతప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని చికిత్స కోసం భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా ధ్వంసం అయ్యింది. లైన్‌మెన్ కందుకూరి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధిస్తాం బహుజన సంఘాలు




కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) భారత రాజ్యాంగం స్పూర్తికి విరుద్ధంగా ప్రస్తుత రాజకీయాలు జరుగుతున్నాయని భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో స్థానిక కొత్తగూడెం క్లబ్ లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని తాండ్ర వెంకటేశ్వర్లు, భూపతి శ్రీనివాస్, చదలవాడ సూరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులతో పాటు పలు సంఘాలు నాయకులు మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో దశాబ్దంపైగా పాలకుల పరిపాలన పరిశీలిస్తే సమైఖ్యాంధ్రాలో బీసీలకు జరిగిన అన్యాయమే మళ్లీ పునరావృతం అవుతోందన్నారు. తెలంగాణలో మళ్లీ సంపన్న వర్గాలే రాజ్యమేలుతున్నాయని బడుగు, బలహీన వర్గాలను యాచించే స్థాయికి పరిమితం చేశారన్నారు. 78 ఏళ్ల స్వతంత్ర్య భారత వనితకు ఇదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు బీసీలను ఓటు బ్యాంకుగా చూసి, సంక్షేమ పథకాలను ఎరవేస్తున్నారని తెలిపారు. విద్య, ఉపాధి రంగాల్లో దామాషా వాటా దక్కకుండా కుట్రలు చేస్తూ బీసీలను పేదరికంలో నెట్టేస్తున్నారని చెప్పారు. 70 ఏళ్ల నుంచి అన్ని రాజకీయ పార్టీలు బీసీలను మోసం చేస్తూ వస్తున్నాయన్నారు. తెలుగు రాష్ట్రాల్లో స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఒక్క బీసీ ముఖ్యమంత్రి కాలేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి, స్థానిక సంస్థలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్ల పట్ల తమ విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని కోరారు తెలంగాణలో త్వరలో జరగనున్న గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బీసీలకు న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించేలా చట్టపరమైన రిజర్వేషన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా కుల గణన పేరిట రాజకీయ పార్టీలు వారికి అనుగుణంగా బీసీలను పావులాగా వాడుకుంటున్నారని ఆరోపించారు. స్వాతంత్రం వచ్చినప్పుడు నుంచి పాలకవర్గాలతో బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వేషన్ సాధించేవరకు బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి కార్యక్రమాలు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేంద్ర రావు, మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సిపిఐ నాయకులు జర్పుల ఉపేందర్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు, బిఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు కురిమెళ్ల శంకర్, 27 వార్డు మాజీ కౌన్సిలర్ ప్రసాద్, న్యాయవాదులు సాధిక్ పాషా, అనుదీప్, సీపీఎం పార్టీ లిక్కి బాలరాజు, కాపు కృష్ణ, రమేష్, నవతన్, బీసీ నాయకురాలు సింధు తపస్వి తదితర బహుజన సంఘ నాయకులు పాల్గొన్నారు.



## ఆంధ్రా మీడియా చర్యలు హేయనీయం

**– జూపల్లి రాము**



**కారేపల్లి :** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై మహా న్యూస్ ఛానల్ చేసిన ఆసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్వీ ఖమ్మం జిల్లా నాయకుడు జూపల్లి రాము తెలిపారు. ఆదివారం కారేపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మహా న్యూస్ ఛానల్‌పై దాడి చేశారని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ని అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. గతంలో థంబ్ నేల్స్ పెట్టి కేటీఆర్‌ను వ్యక్తిగతంగా అవమానపరుస్తూ క్యారెక్టర్‌ని బదనాం చేసే విధంగా ఆంధ్రా మీడియాలో ప్రసారం చేయడం హేయమైన చర్య అన్నారు. మళ్లీ ఇలాంటివి పునరావృతం అయితే బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో తగిన గుణపాఠం చెప్తామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, 420 హామీలు నెరవేర్చలేక కేటీఆర్ పైన ఫోన్ టాపింగ్ అని చెప్పి డైవర్షన్ పాలిటిక్స్ కు తెరలేపిందని ఎద్దేవా చేశారు.

### 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ జోరు..

# అన్నపూర్ణ స్టూడియోస్‌లో పవన్ కళ్యాణ్!



టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మరియు దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' గబ్బర్‌సింగ్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుంటడంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాజకీయాలకు విరామం ఇచ్చి సినిమాలను కంప్లీట్ చేస్తున్నాడు.
ఇప్పటికే హరిహర వీరమల్లు, ఓజీ సినిమా షూటింగ్‌లను కంప్లీట్ చేసిన పవన్ ప్రస్తుతం ఉస్తాద్ భగత్ సింగ్‌ని కూడా పూర్తి చేస్తున్నాడు. అయితే ఈ సినిమా షూటింగ్‌కి సంబంధించి ప్రస్తుతం ఒక అప్‌డేట్ వైరలవుతుంది.ప్రస్తుతం అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నట్లు సమాచారం. పలు కీలక సన్నివేశాలను పవన్ కళ్యాణ్‌తో తెరకెక్కిస్తున్నాడు హరీశ్ శంకర్. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ సరసన యువ నటి శ్రీలీల సందడి చేయనుంది. ఈ సినిమాకు దర్శకుడు దశరథ్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. సాక్షి వైద్య, అశుతోష్ రానా, గౌతమి, నాగ మహేష్, టెంపర్ వంశీ, కేజీఎఫ్ ఫేమ్ అవినాష్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ ఈ భారీ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.

## విజ్జూ.. నిన్ను గర్వపడేలా చేస్తా!



నిరంతరం వార్తల్లో నిలిచే జంట అంటే.. టక్కున గుర్తొచ్చే పేర్లు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా. వీరిద్దరూ ప్రేమలో ఉన్నారని సోషల్ మీడియా కోడై కూస్తుంటుంది. దానికి తగ్గట్టే వీరిద్దరి ప్రవర్తన కూడా ఉంటుంది. శుక్రవారం రష్మిక తాజా సినిమా 'మైసా'కు చెందిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

ఈ పోస్టర్ లుక్ అందర్నీ ఆశ్చర్యపరుస్తున్న నేపథ్యంలో.. రష్మికకు ఆల్ ది బెస్ట్ చెబుతూ అభిమానులనుంచి అభినందనలు వెల్లువెత్తాయి.ఈ క్రమంలోనే విజయ్ దేవరకొండ కూడా ఇన్‌స్టా ద్వారా రష్మికను అభినందించారు. 'మైసా' పోస్టర్‌కి 'ఇది అద్భుతంగా ఉండనుంది' అనే కామెంట్‌ని జత చేసి షేర్ చేశారు విజయ్ దేవరకొండ. దీనికి రష్మిక ఇచ్చిన రిట్కప్లై ఇప్పుడు అందర్నీ ఆకర్షిస్తుండటంతోపాటు చర్చనీయాంశంగా మారింది.'విజ్జూ.. ఈ సినిమాతో నేను.. నిన్ను గర్వపడేలా చేస్తానని మాటిస్తున్నా..' అని క్యాప్షన్ పెడుతూ ఒక హార్ట్ ఎమోజీని కూడా జోడించింది రష్మిక. ఈ కామెంట్‌లో విజయ్‌ని 'విజ్జూ..' అని పిలవడంతో ఇప్పుడు అది పెద్ద హాట్ టాపిక్‌గా మారింది. 'ముద్దుపేర్లతో పిలుచుకునేంతవరకూ వచ్చిందనమాట వ్యవహారం..' అంటూ పలువురు కామెంట్లు చేస్తున్నారు.

## వామ్మో.. తమన్నా ఏంది

# ఇలా తయారైంది..

### – లుక్ చూసి అంతా షాక్



తెలుగు ప్రేక్షకులని తన నటన, డ్యాన్స్ తో ఎంతగానో ఆకట్టుకున్న ముద్దుగుమ్మ తమన్నా. టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన నటిస్తూ తక్కువ సమయంలోనే టాప్ హీరోయిన్లలో స్థానం దక్కించుకుంది. వైవిధ్యమైన పాత్రల్లో మెరిసి, ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి అనేక అవార్డులు కూడా సొంతం చేసుకుంది. చివరిగా ఓదెల 2 చిత్రంతో పలకరించింది. ఈ సినిమా ప్రేక్షకులని అంతగా అలరించలేకపోయింది. అయితే తమన్నా హీరోయిన్‌గా చేస్తూనే అడపాదడపా స్పెషల్ సాంగ్స్‌లో మెరుస్తూ అదరగొడుతుంది.తమన్నా నెక్ట్స్ ప్రాజెక్ట్ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు.ఆమె విజయ్ వర్మ అనే వ్యక్తితో ప్రేమలో మునిగి తేలింది. కొన్నాళ్ల పాటు ఇద్దరు సరదాగా కలిసి తిరిగారు. ఏమైందో ఏమో కాని ఇటీవల వారు బ్రేకప్ చెప్పుకున్నట్టు సమాచారం. ఇక ఇదిలా ఉంటే తాజాగా తమన్నా స్టన్నింగ్ లుక్ అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. పాలఛాయ లాంటి శరీరం, సన్నని నడుము, చూడచక్కనైన రూపంతో పాలరాతి శిల్పంలా కనిపించే తమన్నా ఇప్పుడు చాలా లావుగా గుర్తు పట్టలేనంతగా మారంది. అసలు ఈమె తమన్నానేనా అని కొందరు నోరెళ్లపెడుతున్నారు.ఈవిడ మా ఫేవరేట్ హీరోయిన్ తమన్నా కాదు, మిల్కీ బ్యూటీ ఇలా మారిపోవడం ఏంటి, తమన్నాని ఇలా చూస్తానని ఎప్పుడూ అనుకోలేదు.. అంటూ నెటిజన్లు తమ రియాక్షన్ తెలియజేస్తున్నారు. కొంతమంది అయితే తమన్నా లుక్‌తో కాదు టాలెంట్‌తో ఎదిగింది. మేకోవర్ కావడం ఆమెకు చాలా చిన్న విషయం అంటూ సపోర్ట్ చేస్తున్నారు. తమన్నాపై కొందరు పనిగట్టుకుని బాడీ షేమింగ్‌కి పాల్పడుతున్నారని మండిపడుతున్నారు. తమన్నా ఇటీవల నటించిన సినిమాలు, వెబ్ సిరీస్‌లు ఏవి కూడా ఆమె కెరీర్‌కు అంతగా కలిసి రాలేదు. దీంతో ఏదైనా సినిమా కోసమే ఆమె ఇలా లుక్ మార్చి ఉండొొచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. బాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ అన్న తేడా లేకుండా అన్ని భాషల్లోనూ హీరోయిన్‌గా అదరగొట్టింది మిల్కీ బ్యూటీ తమన్నా. స్త్రీ 2 లో చేసిన ఐటెమ్ సాంగ్ లో తమన్నా అందచందాలకు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. ఇటీవల అజయ్ దేవ్‌గణ్ 'రైడ్

## మెగా అభిమానులకు

# గుడ్ న్యూస్

### రీ రిలీజ్‌కి రెడీ అవుతున్న చిరంజీవి 'స్టాలిన్'




మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు శుభవార్త!. 2006లో విడుదలై బాక్సాఫీస్ వద్ద విజయం సాధించిన ఆయన సూపర్ హిట్ చిత్రం 'స్టాలిన్' రీ–రిలీజ్‌కు సిద్ధమవుతోంది. దాదాపు 19 ఏళ్ల తర్వాత ఈ చిత్రం తిరిగి థియేటర్లలో సందడి చేయనుండటంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సినిమాను ఆగష్టు 22న చిరంజీవి బర్త్‌డే కానుకగా విడుదల చేయబోతున్నట్లు తెలుస్తుంది.తమిళ దర్శకుడు ఎ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'స్టాలిన్' చిత్రంలో చిరంజీవి సామాజిక సేవకుడిగా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటించగా, మణిశర్మ అందించిన సంగీతం, ముఖ్యంగా పాటలు అప్పట్లో పెద్ద హిట్ అయ్యాయి.



### తన శరీరాకృతిపై తప్పుడు కామెంట్స్ చేసిన వారికి దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చిన సమంత

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ఈ మధ్య సినిమాల కన్నా సోషల్ మీడియా పోస్టులతోనే వార్తలలో నిలుస్తుంది. తాజాగా తన సోషల్ మీడియాలో శరీరాకృతి గురించి తప్పుడు కామెంట్స్ చేసిన వారికి గట్టిగా బదులిచ్చింది సామ్. తనని విమర్శించే వారికి ఫిట్ నెస్ సవాల్ విసురుతూ తాను జిమ్ లో చేస్తున్న పుల్ అప్స్ వీడియోని పంచుకుంది. నా గురించి తప్పుడు కామెంట్స్ చేసే వారు మూడు పుల్–అప్స్ తీసి చూపించాలని, అలా చేయలేని పక్షంలో తన గురించి మాట్లాడటం మానేయాలంటూ కాస్త ఘాటుగానే బదులిచ్చింది సమంత.ఇటీవల సమంత అవార్డ్‌ల వేడుకకి హాజరు కాగా, ఆ కార్యక్రమానికి శ్రీలీల కూడా హాజరైంది. అయితే ఆ సమయంలో సమంత, శ్రీలీల ఇద్దరు కలిసి దిగిన ఫొటోలు సోషల్ మీడియాని షేక్ చేశాయి. అయితే ఇందులో సమంత లుక్ కొందరిలో అనేక అనుమానాలు కలిగించాయి.

అనారోగ్యం వలన సమంత బాగా సన్నబడ్డారని కొందరు కామెంట్లు చేశారు. ఈ క్రమంలో తన లుక్స్‌పై వస్తున్న విమర్శలకు సమాధానంగా సమంత తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఓ వీడియో పోస్ట్ చేసింది. అందులో సామ్ జిమ్‌లో పుల్ అప్స్ చేయడం మనం గమనించవచ్చు.అయితే తన పోస్ట్‌కి ఓ ఇంట్రెస్టింగ్ క్యాప్షన్ జోడించింది సమంత. మనం ఒక డీల్ చేసుకుందాం. 'సన్నబడ్డావు', 'ఆరోగ్యం బాలేదా?' లాంటి చెత్త కామెంట్స్ ఎవరైతే చేస్తున్నారో , మీరు కనీసం మూడు పుల్–అప్స్ చేయగలగాలి. ఒకవేళ మీరు ఆ పని చేయలేకపోతే, దయచేసి నా గురించి మాట్లాడడం మానేస్తే మంచిది అంటూ సమంత పేర్కొంది. ఇక కొంతకాలంగా సమంత మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో పోరాడుతున్న విషయం మనందరికి తెలిసిందే. 2022లో తాను ఈ వ్యాధి బారిన పడినట్లు చెప్పుకొచ్చిన ఈ భామ అప్పటి నుంచి ప్రత్యేక చికిత్స తీసుకుంటూనే, ఫిట్‌నెస్‌పై ఎక్కువగా ఫోకస్ పెడుతుంది. ఇటీవల సమంత నిర్మించిన 'శు

### అనుబంధం కోసం

## నియమాలు



వైవాహిక జీవితంలోని మధురానుభూతుల్ని ఎంజాయ్ చేస్తున్నారు న్యూ సెలబ్రిటీ కపుల్ నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల. రీసెంట్‌గా నాగచైన్య ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తమ పర్సనల్ లైఫ్ గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. 'భార్యాభర్తలమే అయినా.. వృత్తిపరమైన పని ఒత్తిడుల వల్ల కలిసి ఎక్కువసేపు సమయాన్ని గడపలేని పరిస్థితి. అందుకే ఇద్దరి మధ్య అనుబంధాన్ని పెంచుకునేందుకు కొన్ని నియమాలను పెట్టుకున్నాం.ఇద్దరం ఒకే సిటీలో ఉంటే ఉదయం, రాత్రి సమయాల్లో తప్పకుండా కలిసే భోజనం చేయాలనేది అందులో ముఖ్యమైన నియమం. ఆదివారాలు సరదాగా షికారుకెళ్లాలి. నైట్ సినిమాకెళ్లాలి. నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేసుకోవడమో, లేక వండుకోవడమో చేయాలి.. ఇలా అనమాట.తనకు పుస్తకాలు చదవడం ఇష్టం. నాకు రేసింగ్ ఇష్టం. అందుకే సెలవుదినాల్లో ఇద్దరి ఇష్టాలకూ తగ్గట్టు రోజుల్ని ప్లాన్ చేసుకుంటాం. ఇటీవలే తనకు రేస్ ట్రాక్‌పై డ్రైవింగ్ చేర్పించా. తను ఎంతో సంతోషించింది. ఎంజాయ్ చేసింది కూడా' అంటూ చెప్పుకొచ్చారు నాగచైతన్య.

# సొంతింటికోసం మధ్య తరగతి ఆరాటం

హీరో సిద్ధార్థ్ నటించిన మధ్య తరగతి భావోద్వేగ ప్రయాణం '3%దీఎఖ%'. శ్రీగణేష్ దర్శకుడు. అరుణ్ విశ్వ నిర్మాత. జూలై 4న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ని శనివారం మేకర్స్ విడుదల చేశారు. సొంత ఇంటికల నిజం చేసుకునేందుకు ఓ మధ్య తరగతి కుటుంబం పడే ఆరాటం ఈ ట్రైలర్‌లో చూడొొచ్చు.అందరికీ కనెక్టయ్యేలా ఈ సినిమా ఉంటుందని, హృదయాలను తాకేలా ఈ సినిమాను దర్శకుడు శ్రీగణేష్ ప్రజెంట్ చేశారని, సిద్ధార్థ్ మధ్య తరగతి కుర్రాడి పాత్రలో ఒదిగిపోయారని మేకర్స్ తెలిపారు. శరత్‌కుమార్ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో దేవయాని, యోగిబాబు, మీతా రఘునాథ్, చైత్ర కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి మాటలు: రాకేందు మౌళి, డీవోపీ: దినేష్ కృష్ణన్, బి.జితిన్ స్టానిస్లాన్, సంగీతం: అమృత్ రామ్‌నాథ్.



# కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

- పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవు
-జిల్లా కలెక్టర్ : సందీప్ కుమార్ ఝా
- తిప్పాపూర్ గోశాలలో 137 జతల కోడెలు పంపిణీ



వేములవాడ,(ప్రశ్న న్యూస్) కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు.శుక్రవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి



దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్ లోని గోశాలలో కోడెల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలను పరిశీలించి, అర్హులైన రైతులకు 137 జతల కోడెలను- 274 జీవాలను అధికారులు రైతులకు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలను కేవలం వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పక్కాగా చూడాలని సూచించారు. వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సంరక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఆలయ ఈ.ఓ. రాధాభాయి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, గోశాల కమిటీ సభ్యులు రాధా కృష్ణ రెడ్డి, పశు వైద్యాధికారులు, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పత్రికలు లేకపోతే మీరు అధికారంలో ఉండేవారు కాదు

- మహా న్యూస్ ఛానల్‌పై దాడిని ఖండిస్తున్నాం
- వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు : ముప్పిడి శ్రీధర్



వేములవాడ,(ప్రశ్న న్యూస్)ప్రముఖ టెలివిజన్ ఛానల్ మహా న్యూస్‌పై జరిగిన దాడిని కాంగ్రెస్ పార్టీ ఖండించింది. ఈ దాడి పట్ల ఆగ్రహం వ్యక్తం చేసిన వేములవాడ పట్టణ కాంగ్రెస్ నేత ముప్పిడి శ్రీధర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను ధైర్యంగా వెలుగులోకి తీసుకొచ్చే మీడియా సంస్థలపై దాడులు చేస్తే అది ప్రజాస్వామ్యానికి దెబ్బ తగిలినట్టేనన్నారు.శనివారం జరిగిన దాడి బాధాకరమని, ఇలాంటి చర్యలు తక్షణమే నిలిపివేయాలని వ్యాఖ్యానించారు. మీడియా లేకపోతే మీరు పదేళ్ల పాలనలో ఉండేవారు కారని,తెలంగాణ రాష్ట్ర సాధనలో మీడియా పాత్ర చాలా గొప్పదన్నారు. అలాంటి సంస్థలపై దాడులు సమర్థనీయం కాదని ముప్పిడి శ్రీధర్ అన్నారు. దాడికి పాల్పడిన వారు ఎంతటి వారైనా సరే, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా మంత్రి కేటీఆర్, హరీష్ రావు ఈ వ్యవహారంలో స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కునారం ఫ్లైఓవర్ కుంగిన ఘటనపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ ..

రైల్వే ఘటనపై ఫోన్లో మాట్లాడిన ఎంపీ గడ్డం వంశీ



మంథని ( ప్రశ్న న్యూస్) పెద్దపల్లి.లోకసభ నియోజకవర్గంలోని కునారం ఫ్లైఓవర్ వద్ద రైల్వే ట్రాక్ కుంగిన ఘటనపై ఎంపీ శ్రీ గడ్డం వంశీకృష్ణ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదవశాత్తు పరిస్థితి కారణంగా రైల్వే రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని ఎంపీ పేర్కొన్నారు.ఈ పరిణామాన్ని గురించి తెలుసుకున్న ఎంపీ దక్షిణ మధ్య రైల్వే అధికారులు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖతో టెలిఫోన్ ద్వారా మాట్లాడి, తక్షణంగా సమగ్ర నివేదిక సమర్పించాలని కోరారు అలాగే, సమస్య పరిష్కారానికి వెంటనే శాశ్వత పరిష్కార మార్గాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల రవాణా భద్రతకు మా ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యత ఇస్తోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వంతెన యొక్క నిర్మాణ పరిస్థితిపై పూర్తి స్థాయి సాంకేతిక పరీక్షలు నిర్వహించాలి, అని ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు. పర్యవేక్షణ లోపం లేదా నిర్వహణా లోపాల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందా అన్న కోణంలోనూ విచారణ జరపాల్సిన అవసరం ఉందని ఎంపీ స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



చందుర్తి,(ప్రశ్న న్యూస్)వేములవాడ నియోజకవర్గంలోని చందుర్తి మండలం,ఆశిరెడ్డిపల్లి గ్రామంలో గత 15 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నేరెళ్ల వెంకటి (70) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.గ్రామంలో ఇంటి వద్ద ఉన్న వెంకటిని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పూదూరి భరత్ అనే యువకుడు ద్విచక్ర వాహనంతో బలంగా ఢీకొట్టడంతో వెంకటి కి తీవ్ర గాయాలయ్యాయి.భరత్ గ్రామంలో మద్యం సేవిస్తూ, గంజాయి కి అలవాటు పడి ఈ ప్రమాదానికి కారణమైనట్లు గ్రామస్తులు తెలిపారు, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

# అరుణాచల గిరి ప్రదక్షిణ భక్తులకు శుభవార్త

- ప్రత్యేక బస్సు సౌకర్యం
- వేములవాడ డిపో మేనేజర్ : శ్రీనివాస్

వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ, కరీంనగర్ భక్తులకు శుభవార్త! పౌర్ణమి సందర్భంగా జూలై 10న తమిళనాడులోని అరుణాచలేశ్వర స్వామి వారి గిరి ప్రదక్షిణలో పాల్గొనదలచుకున్న భక్తుల కోసం టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చిందని వేములవాడ డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
ఈ టూర్‌లో భాగంగా ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు జూలై 8 మంగళవారం సాయంత్రం వేములవాడ బస్టాండ్ నుండి బయలుదేరి, కరీంనగర్ చేరుకుంటుంది. అక్కడి నుండి హైదరాబాద్ మీదుగా అరుణాచలానికి ప్రయాణం కొనసాగుతుంది.

- ప్రయాణ వివరాలు
- కాణిపాకం శ్రీ విఘ్నేశ్వర స్వామి దర్శనం
- వెల్లూరు శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం సందర్శన

జూలై 9 రాత్రి అరుణాచలం చేరుకుని, జూలై 10న గిరి ప్రదక్షిణ పూర్తిచేసి అదే సాయంత్రం బయలుదేరుతుంది. తర్వాత జూలై 11 ఉదయం శ్రీ అలంపూర్ జోగులాంబ శక్తిపీఠ దర్శనం పూర్తిచేసి, అదే రోజు సాయంత్రం కరీంనగర్ %-% వేములవాడ తిరుగు ప్రయాణం జరుగుతుంది.
- టూర్ ప్యాకేజీ ధర: రూ.4,700/- మాత్రమే
(ఈ ధరలో బస్ ఛార్జీలు, టోల్ ఫీజులు, బోర్డర్ టాక్స్, ఇతర సెస్ చార్జీలు, నాలుగు దేవాలయాల దర్శనాలు మొత్తం కలుపుకొని ఉంటుంది.)

- బుకింగ్ వివరాలు

వేములవాడ, కరీంనగర్, సిరిసిల్ల ప్రాంతాల భక్తులు తమ దగ్గరలోని బస్టాండ్ లేదా టీజీఎస్ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లలో బుక్ చేసుకోవచ్చు.



- పూర్తి సమాచారం కోసం సంప్రదించండి
- 99592 25926 - 73828 51826 - 94405 21412
- బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. సీట్లు పరిమితంగా ఉన్నందున ముందుగా రిజర్వేషన్ చేసుకోవాలని డిపో మేనేజర్ శ్రీనివాస్ వెల్లడించారు.

## బీసీ రిజర్వేషన్లకు అసెంబ్లీ తీర్మానం సరిపోదు...! కేంద్రాన్ని ఒప్పించాలి..!!

- బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి
- సీఎం రేవంత్‌కు బీసీ నేతల విజ్ఞప్తి
- బీసీ రిజర్వేషన్లలో మోసం జరిగితే ఉద్యమం తప్పదు
- బీసీ సాధికారత సంఘం ఉమ్మడి జిల్లాధ్యక్షులు : పొలాస నరేందర్



వేములవాడ,(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటకు కట్టుబడి, బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి బిల్లులకు ఆమోదం తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే చర్యలు తీసుకోవాలని బీసీ సాధికారిత సంఘం నేతలు డిమాండ్ చేశారు.వేములవాడ బీసీ సాధికారిత సంఘం కార్యాలయంలో జరిగిన ముఖ్య బీసీ నేతల సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్ మాట్లాడుతూ"అసెంబ్లీలో తీర్మానం చేసినంత మాత్రాన సరిపోదు. కేంద్రం ఆమోదించేలా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి. ప్రధానిని మెప్పించి, ఒప్పించి, 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తీసుకొచ్చి, చట్టబద్ధంగా, శాస్త్రీయంగా ఎన్నికలు నిర్వహించాలి," అన్నారు.సెప్టెంబర్ 30 లోపు పంచాయతీ ఎన్నికలు,జూలై 24 లోపు రిజర్వేషన్ల ఖరారుహైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం జూలై 24 లోపు రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన అవసరం ఉందని, జూలై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కేంద్రంతో చర్చలు ప్రారంభించాలని నరేందర్ డిమాండ్ చేశారు." బీసీ రిజర్వేషన్లలో మోసం జరిగినట్లయితే బీసీలు ఊరుకోరన్నారు."స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి బీసీలు ఎన్నోసార్లు మోసపోయారు. ఈసారి రిజర్వేషన్ల అమలులో కూడా మోసం జరిగితే సహించబోము.1995లో సర్పంచ్ ఎన్నికల్లో కోర్టు అభ్యంతరాల వల్ల అధికారాలు అప్పగించకపోవడం మాదిరిగానే మరోసారి అన్యాయం జరగకూడదు," అని హెచ్చరించారు.ఈ సమావేశంలో పట్టణ బీసీ సాధికారిత సంఘం ప్రధాన కార్యదర్శి ఇల్లందుల వెంకటేశం,జిల్లా బీసీ నేతలు అంబాటి సంతోష్ యాదవ్, సీహెచ్.రామస్వామి గౌడ్, అన్నారపు ఇస్థారి,ఎట్టెం సాయి కృష్ణ,కుంభం రవి, ఉయ్యాల భూమయ్య గౌడ్, ముద్రకోల లింబాద్రి,ముద్రకోల గణేష్,అబ్బనవేని కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్ రీడర్ స్వేచ్ఛ మృతికి సంతాపం

తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి
టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) ది జర్నలిస్ట్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పాలక మండలి సభ్యురాలు తెలంగాణ ఉద్యమ జర్నలిస్ట్ ప్రముఖ న్యూస్ ప్రెజెంటర్ స్వేచ్ఛ అకాల మృతికి తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర సంతాపము తెలియజేస్తూ వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ పాలక మండలి తరపున ఘనంగా నివాళులు అర్పించిన అనంతరము తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచూ ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న స్వేచ్ఛ ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకోవడం అత్యంత విషాదకరం. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని వేడుకుంటు ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## బోయినిపల్లిలో "మన్ కీ బాత్" సామూహిక వీక్షణ

- భద్రాచలం మహిళల విజయాన్ని ప్రశంసించిన ప్రధాని
- భాజపా మండల శ్రేణుల హర్షం



బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్" కార్యక్రమాన్ని బోయినిపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ నాయకులు,కార్యకర్తలు, ప్రజలు కలిసి వీక్షించారు.
- ప్రధాని మోదీ సందేశం
- తీర్థయాత్రల ఆధ్యాత్మికత, సేవా దృక్పథాన్ని వివరించారు.
- కైలాస-మానస సరోవరం యాత్రలు మళ్లీ ప్రారంభమయ్యాయని తెలిపారు.
- ఎమర్జెన్సీ సమయంలో అటల్ బిహారీ వాజ్‌పేయి వ్యాఖ్యలు గుర్తుచేశారు.
- భద్రాచలం మహిళలు తయారుచేస్తున్న మిల్లెట్ బిస్కెట్లు లండన్ దాకా వెళ్తున్నాయని ప్రశంసించారు. ప్రధాని ప్రసంగం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. "మన్ కీ బాత్" ప్రజల్లో చైతన్యం నింపిందని స్థానికులు తెలిపారు.

## జర్నలిస్టుల ఐక్యత,హక్కుల పరిరక్షణ,సంక్షేమం కోసం డీజేఎఫ్ యూనియన్ కృషి చేస్తుంది

- డీజేఎఫ్ యూనియన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు : బుచ్చి రాములు
- డీజేఎఫ్ యూనియన్ వేములవాడ నూతన కార్యవర్గం ఎన్నిక



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలోని మున్నూరుకాపు సత్రంలో డీజేఎఫ్ యూనియన్ (డెమోక్రటిక్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఉత్సాహపూరితంగా సభ్యుల నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరిగింది.
- **నూతన కార్యవర్గంగా ఎంపికైనవారు**
- **అధ్యక్షులు :కొప్పుల బుచ్చి రాములు**
- **ఉపాధ్యక్షులు: సంటి నవీన్,కంటే మల్లయ్య**
- **గౌరవ సలహాదారులు: వెలిచాల మల్లేశం, ఎర్రం నరసయ్య, చంద్రశేఖర్**
- **ప్రధాన కార్యదర్శి: వేదూరి నర్సయ్య**
- **కోశాధికారి: వరి లక్ష్మీనారాయణ**
- **కార్యదర్శి: వేదూరి సంజీవ్ కుమార్**
- **ప్రచార కార్యదర్శి: చేకుర్తి నవీన్**

కార్యవర్గ సభ్యులులి: కూస రవి, కోసం రాజు, చేర్ల బాలు, లింగంపల్లి సత్యం, చింతపంటి శ్రీనివాస్, అంగూరి సుధాకర్, వరెడ్డి నరేందర్ రెడ్డి, తడక కృష్ణ హరి, కుమ్మరి రమేష్, చిలుక బాబు, సుధా మల్ల రత్నం, చిలక దాసు, బొప్పరాజు,బండి చంద్రమౌళి లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డీజేఎఫ్ నూతన అధ్యక్షులు కొప్పుల బుచ్చి రాములు మాట్లాడుతూ, "జర్నలిస్టుల ఐక్యత,హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం డీజేఎఫ్ బలంగా పోరాడుతుంది. కొత్త కార్యవర్గంతో మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతాం," అని అన్నారు.

## ప్రధానోపాధ్యాయులు భూక్యా రెడ్డి సేవలు ఆదర్శప్రాయం

- నేడు భూక్యా రెడ్డి పదవీ విరమణ
- క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు : తిరుపతి, శ్రీనివాస్ శుభాకాంక్షలు



బోయినిపల్లి,(ప్రెస్ న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని కొదురుపాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూక్యా రెడ్డి నేడు సోమవారం పదవీ విరమణ చేయనున్న సందర్భంగా, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ బొడ్డు తిరుపతి, జాగిరి శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "భూక్యా రెడ్డి దీర్ఘకాలం నుంచి విద్యా రంగానికి సేవలందిస్తూ, అనేక పాఠశాలల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఆయన పాత్ర ప్రశంసనీయం. నేడు పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలనే మనస్పూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం" అని పేర్కొన్నారు.

## జిల్లా అద్యక్షునికి ప్రత్యేక అభినందనలు తెలంగాణ బీసీ లెక్చరర్ల సంఘం రాష్ట్ర కమిటీ



నిజామాబాద్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా తెలంగాణ బీసీ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జక్కుల రాధాకిషన్ ఆర్మూర్ రోటరి క్లబ్ నూతన అధ్యక్షులుగా ఎన్నిక కావటం హర్షణీయం అభినందనీయం అని తెలంగాణ బీసీ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడి విట్టల్ తెలియజేసారు.
ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు. రోటరీ క్లబ్ సేవలను గ్రామగ్రామాలకు విస్తరింపజేయాలని రాధాకిషన్ (ఆర్కే)ని కోరినారు.

# విశ్వనగర ప్రతిష్టను దెబ్బతీస్తున్న యాచకులు

- ఉచిత పథకాలు పొందుతున్నను యాచకవృత్తి
- యాచక వృత్తి మాటున అసాంఘిక కార్యకలాపాలు
- నగరంలో పెట్రేగిపోతున్న యాచక మాఫియా
- కళ్ళుతెరవని పసిగుడ్డులతో యాచక వ్యాపారం
- కోట్లకు పడగ లెత్తుతున్న యాచకులు
- యాచక వృత్తితో వచ్చే డబ్బులతో యధేచ్చగా పైనాన్స్ వ్యాపారాలు
- యాచకవృత్తి మాటున డ్రగ్స్ దందాలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పేద ప్రజల బ్రతుకులు మారాలని ప్రభుత్వ ఎన్నో ఉచిత పథకాలను ప్రవేశ పెడుతున్నప్పటికి యాచకవృత్తిని చేపట్టే వారిని దేవుడు కూడా మార్చలేని పరిస్థితులు తలెత్తాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాతాల నుండి నగరానికి వలస వచ్చి నగర ముఖ్య కూడళ్ళ వద్ద తిష్టవేసి వచ్చి పోయే వాహణదారులను, పాధాచారులను యాచించడం ఒక వృత్తిగా మారింది. ఈ క్రమంలోనే నగరంలో యాచకవృత్తి ఒక పెద్ద మాఫియాగా మారింది ఈ వృత్తిని కొనసాగిస్తున్న యాచకులు తాము యాచించే స్థలాలను తమ అడ్డాలుగా మార్చుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుచున్నారని సమాచారం. ఈ క్రమంలోనే తమ పరిరక్షణ కోసం కొందరిని తమ నాయకులుగా నియమించుకంటున్నారు. యాచించేందుకు అవసరమయ్యే చిరిగిన బట్టల్ని, యాచించే సమయంలో చంకనెత్తు కోవడానికి కావాల్సిన చంటి పిల్లల్ని సైతం అద్దెకిచ్చే వాళ్లున్నారని తెలిసింది. నగరంలో క్రమేపి యాచకుల సంఖ్య ఘననీయంగా పెరుగుచుండడంతో ఈ వృత్తి పట్ల ఎలా ఆకర్శితులవు చున్నారనే విషయం తేటతెల్లమవుతుంది. ముఖ్యంగా నగరంలో ముఖ్య కూడళ్ళలో, ట్రాఫిక్ సిగ్నల్స్, దేవాలయ ప్రాంగణాలు, మెట్రోస్టేషన్లు, బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్ల వంటి జనసాంద్రత ఉన్న ప్రాంతాలలో కొందరు ఈ వృత్తిని వారసత్వంగా చేపడుతున్నారని విశ్వాసనీయ సమాచారు. అలాగే ఒక ప్రాంతంలోని యాచకులు మరో ప్రాంతంలో భిక్షాటన చేయడానికి వీలు లేకుండా ఆదిపత్యం చలాయిస్తున్నారు. లాభసాటి ఉండే యాచక కేంద్రాలపై అక్కడి యాచకులు తమ ఆధిపత్యం ప్రదర్శించి ఇతరులను ఇక్కడ యాచించకుండా దాడులు జరిపిన సంఘటనలు కూడా ఉడడం విచిత్రం. ఈ వృత్తికి ప్రాధాణ్యత ఎంత పాకిందనేది ఆలోచించాల్సిన విషయం. ఈ సమయంలోనే అడుగుపెట్టిన దళారీలు యాచక వృత్తిని తమకు అనుకూలంగా మార్చుకొని ఈ వృత్తిని ఒక పెద్ద మాఫియాగా మార్చి యాచకులతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుచు అక్రమ వ్యాపారాలు చేయిస్తునట్లు విశ్వాసనీయ సమాచారం. అలాగే మరికొందరు దళారీలు ఒక అడుగు ముందుకేసి ఏజన్సీలను ఏర్పాటు చేసుకొని యచకులను నియమించుకొని తమ వాహణాలలో వారిని ఆయా అడ్డాలపై వదిలి మళ్ళీ సాయంత్రం అడ్డాలపై ఉన్న వారి వద్ద నుండి వచ్చిన డబ్బును వసూలు చేసుకుంటు ఈ వృత్తిని కొనసాగిస్తున్నారు. ఆలాగే స్థానిక బిచ్చగాళ్ల నుండి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. అయితే ఈ వృత్తి చేపడుచున్న వారిలో తెలుగు రాష్టల వారి సంఖ్యనే అధికంగా ఉండడం గమనార్హం. ఇక కొన్ని ప్రదేశాలలో బిచ్చగాళ్లు ఐదు రూపాయలకు తక్కువ వేసిన వారిని అవమానించడం, తటపటాయించే వారిని కన్నెర్ర చేసి బెదిరించడం,గద్దించడం కూడా చేస్తుండడం విచిత్రం. గతంలో బహిరంగ ప్రదేశాల్లో జరిగే భిక్షాటనపై నిషేధం ప్రకటించినప్పటికి అచరణకు నోచుకోవడం లేదు. జనసమర్ధమున్న ప్రాంతాల్లో ఇకపై భిక్షాటన చేస్తే కఠిన చర్యలు తీసుకోవలసి ఉన్నప్పటికి అచరణలో అడుగు ముందుకు పడడం లేదు. యాచకులు లేని రాష్టంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటికి జనాలలో మార్పు రావడం లేదు. మంచి ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సంక్షేమ పథకాల రుచికి అలవాటు పడి కష్టించి పని చేయడానికి ససేమిరా అని ఉచిత పథకాలను పొందుతు యాచక వృత్తి పట్ల ఆకర్శితులవ్వడం దురదృష్టకరం. అయితే యాచక వృత్తిలో ఉన్న వారు అంగవైకల్యం, ఇతర అనారోగ్య సమస్యలతో కష్టించి పనిచేసుకోలేని వారిని తప్పిస్తే, పాతిక సంవత్సరాల వయస్సుండి అన్ని విధాల అర్హులైనవారు కూడా ఈ వృత్తిలో కొనసాగడం ఆక్షేపనీయం. యాచక వృత్తిలో ఉన్నవారిని పునరావాస కేంద్రాలకు తరలించి వారికి పునరావాసం లేదా ఆశ్రయం కల్పించడం, చిన్న పిల్లలకైతే చదువు, పెద్దవారికైతే వృత్తిపరమైన శిక్షణ ఇచ్చేందుకు కూడా వసతులు కల్పించి వారిని ఈ వృత్తి నుండి దూరం చేయాల్సిఉంది. యాచక వృత్తిని నిరోధించడంలో భాగంగా ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి ఆరు నెలలకు ఒకసారి దీనిపై సమీక్ష జరిపి యాచక వృత్తి నిషేధ చర్యల అమలుపై సమీక్షించాల్సి ఉంది

### కళ్ళుకూడా తెరవని పసి గుడ్డులతో బిక్షాటన

కొందరు కనుగుడ్డైనా తెరవని పసికందులను చూపి, వారి పోషణ పేరుతో భిక్షాటన వ్యాపారం చేస్తుండగా మరికొందరు రకరకాల జిమ్మిక్కులతో పసిపిల్లకు పాలు లేవు ధర్మం చేయండంటు ప్రజలను మోసగిస్తున్నారు. పిల్లలను చూపి యాచన చేస్తున్న వారు వారిని తల్లిదండ్రుల నుంచి రోజుకు రూ 200 నుంచి రూ.500 చొప్పున అద్దెకు తెచ్చుకుంటున్నారు. మధ్యలో లేచి ఏడ్చి, తమ ఆర్జనకు ఆటంకం కాగూడదన్న ఉద్దేశంతో ముక్కుపచ్చలారని చిన్నారులకు నల్లమందు వంటి మత్తు మందులను ఇచ్చి, వారు నిద్ర లేవకుండా చేస్తున్నారు. శిశువులతో భిక్షాటన చేసే వారు తారసపడితే వెంటనే 1098 (ఛైల్డ్ లైన్) కు ఫోన్ చేస్తే ఆ చిన్నారులను రక్షించి వారికి అవసరమైన సంరక్షణ కల్పిస్తారు. మన రాష్ట్రంలో చైల్డ్ లైన్లు హైదరాబాద్ లో ఉన్నాయి. ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ వీటిని నిర్వహిస్తోంది. ఇకపోతే ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు ఉంది. వాళ్లకి నెలకు సరిపడా బియ్యం, పప్పులు ఇస్తున్నారు, అలాగే వారికి ఆర్థిక అవసరాల కోసం పెన్షన్ కూడా పొందుతున్నారు. అయినను వాళ్ళు అడుకోవడం దురదృష్టకరం. మరీ డబ్బు లేని వాళ్ళు అడుక్కుంటున్నారని అనుకుంటే పప్పులో కాలేసినట్లే. అడుకోవడంతో చాలా డబ్బు సంపాదిస్తు, ఆ డబ్బును అప్పులుగా ఇచ్చి, వడ్డీ వసూలు చేస్తు, చాలా ఆదాయాన్ని సంపాదించే ముష్టి వాళ్ళు ఉన్నారు. యాచించడంతో డబ్బులు వస్తున్నాయని, ఇది కూడా కష్టపడడమే కదా అని వాళ్ళు ఎదురుదాడి చేస్తుండడం గమనార్హం. యాచించడం కూడా ఒక వృత్తి అని భావించి అడుక్కుంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జనసాంద్రత ప్రాంతాలలో యాచకులపై కఠిన చర్యలు తీసుకొని పూర్తి స్థాయిలో యాచకవృత్తిని నిషేధించి విశ్వనగరంగా అభివృద్ది చెందుతున్న మహనగరానికి మరింత ప్రతిష్ట తీసుకువచ్చేందుకు కృషిచేయాల్సి ఉంది.

# కీసర లో కేసరి హాస్పిటల్ నిర్వాకం

**ఒకే పేరు పై మూడు హాస్పిటల్స్**

**తనిఖీలు నిర్వహించిన డి ఎమ్ హెచ్ ఓ**




కీసర (ప్రశ్నన్యూస్)మేడ్చల్ జిల్లా కీసర లోని కేసరి హాస్పిటల్ నిర్వహణలో తీవ్రమైన అవకతవకలు వెలుగు చూశాయి. ముగ్గురు డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందితో నమోదు అయిన కేసరి హాస్పిటల్ పేరుతోనే అదే డాక్టర్లు,సిబ్బంది వివరాలను వాడుతూ నాగారం ప్రాంతంలో రెండు క్లినిక్స్ కీసరలో మరో పాలీ క్లినిక్ కూడా నడుపుతున్నట్టు గుర్తించిన జిల్లా వైద్య అధికారులు. జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి డా. సి ఉమా గౌరీ కేసరి హాస్పిటల్ ను తనిఖీ చేయగా,క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం అనేక నిబంధనల ఉల్లంఘనలు బయటపడ్డాయి.దీనిపై షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపిన జిల్లా వైద్య అధికారి ఉమా గౌరీ,ఎవరైనా ఒకే పేరుతో పలు హాస్పిటల్స్ ఏర్పాటు చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కాంగ్రెస్ అవినీతి సర్కార్ అయితే చర్యలేవి :కేటీఆర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్): కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ఎక్స్ వేదికగా ఫైర్ అయ్యారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. నిజామాబాద్‌లో అమిత్ షా పర్యటన సందర్భంగా కేటీఆర్ కొన్ని ప్రశ్నలు సంధించారు. రేవంత్ రెడ్డి సర్కార్‌పై అవినీతి ఆరోపణలు చేస్తున్న కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని నిలదీశారు. అమిత్ షా గారూ, మీరు నిజామాబాద్‌లో చెప్పారు కదా, రేవంత్ రెడ్డి సర్కార్ కాంగ్రెస్ పెద్దలకు ఏటీఎం లాంటిదని! అయితే మీరు కేంద్ర హోంమంత్రిగా ఉంటూ, ఈ అవినీతిపై సీబీఐ, ఈడీలతో విచారణకు ఆదేశించడానికి ఏం అడ్డం వస్తోంది? తెలంగాణ ప్రజలకు ఓ క్లారిటీ ఇవ్వండి! అని కేటీఆర్ డైరెక్ట్‌గా ప్రశ్నించారు. ఢిల్లీలో కాంగ్రెస్‌తో బీజేపీ కుస్తీ వేస్తున్నట్టు చూపించి, తెలంగాణలో మాత్రం దోస్తీ చేస్తున్నారా? రేవంత్‌తో కుమ్మక్కు రాజకీయాలు ఆడుతున్నారనే ఆరోపణలకు సమాధానం ఏంటి? అని నిలదీశారు. గతంలో ప్రధాని మోడీ కూడా రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో దోచుకుంటున్నారని ఆరోపించారు.

కానీ ఇన్ని రోజులైనా ఒక్క విచారణ కూడా ఆదేశించలేదు. ఇది ఏంటి స్వామీ? పగలు ప్రజాధనం లూటీ చేస్తూ ఢిల్లీకి మూటలు పంపుతున్న కాంగ్రెస్ సీఎంపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అని కేటీఆర్ గట్టిగా ప్రశ్నించారు. తెలంగాణను దేశంలో నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లడంలో కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద జల్లడం చాలా దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. బీజేపీకి తెలంగాణలో 8 ఎంపీ సీట్లు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా, ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదని ఆరోపించారు. ఐఐటీ, ఐఐఎం, మెడికల్ కాలేజీ లాంటి ఉన్నత విద్యా సంస్థలు ఒక్కటి కూడా మంజూరు చేయలేదు. ఇది తెలంగాణ ప్రజలకు బీజేపీ చేస్తున్న అన్యాయం కాదా? నాలుగు కోట్ల ప్రజలు ఈ అన్యాయాన్ని గమనిస్తున్నారని కేటీఆర్ హెచ్చరించారు.

## మావోలకు తెలంగాణ ఆశ్రయం ఇస్తుందేమో ?

**- అమిత్ షా సంచలన కామెంట్స్**



**నిజామాబాద్ (ప్రశ్న న్యూస్)** వచ్చే ఏడాది మార్చి 31 కల్లా దేశంలో నక్సలిజాన్ని అంతం చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. నిజామాబాద్ పసుపు బోర్డు ప్రారంభం తర్వాత జరిగిన సభలో సంచలన కామెంట్స్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని సురక్షితంగా మార్చారు. దశాబ్దాలుగా నక్సలైట్లు దేశంలోని ఆదివాసీ ప్రాంతాల్లో 40 వేల మంది ప్రాణాలు తీశారు, వేల మంది ఆదివాసీలు చేతులు, కాళ్లను నరికేశారు. చాలామంది ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి నక్సలైట్లను నిర్మూలించాలా వద్దా చెప్పండి... అంటూ జనాన్ని అమిత్ షా ప్రశ్నించారు. నక్సలైట్లను చంపకుండా చర్చలు జరపాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంటున్నారు. వాళ్ళు శరణు కోరితే ఎవరు వద్దంటారు. సరెండర్ కావాలనుకుంటే ఆయుధాలు వదిలేసి రావాలని అమిత్ షా పిలుపునిచ్చారు. ఒక వేళ సరెండర్ కాకపోతే వచ్చే ఏడాది మార్చి 31 కన్నా ముందే నక్సలిజాన్ని అంతం చేస్తామన్నారు. కాంగ్రెస్ చెప్పినట్టుగా చేతిలో ఆయుధాలున్న వాళ్ళతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపదని అమిత్ షా తేల్చిచెప్పారు. ఆయుధాలు వదలి... లొంగిపోవాలన్నారు. మెయిన్ స్ట్రీమ్ లోకి వచ్చిన నక్సలైట్లు ఒక రాష్ట్రంలో ఎన్నికల్లో కూడా పోటీ చేశారని అమిత్ షా గుర్తు చేశారు. 2500 మందికి పైగా నక్సలైట్లు ఏడాదిన్నర కాలంలో లొంగిపోయారు. ఇన్నేళ్ల పాటు ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధిని అడ్డుకున్నారు. దీనికి కాంగ్రెస్ పార్టీ ఏం సమాధానం చెబుతుందని అమిత్ షా ప్రశ్నించారు. దేశంలోని నక్సలైట్లకు ఇకపై తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఆశ్రయం ఇస్తుందేమోననే భయం కూడా నాకుందని అన్నారు. అయినప్పటికీ, కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉందనీ, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని అమిత్ షా తెలిపారు.

# అనుమతుల్లేవు.. నిర్మాణాలు ఆగట్లేదు

- జీహెచ్ఎంసీ తీరుపై మండిపడుతున్న స్థానికులు
- మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు..?









**మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్)** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడటం లేదు. నోడల్ అధికారిగా డిప్యూటీ కమిషనర్ రాజు విధులు నిర్వహిస్తున్న అక్రమ నిర్మాణాలని కట్టడి చేయడంలో పూర్తిగా విఫలం చెందారు. అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల భవనాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మల్కాజిగిరి, మౌలాలీ సప్తగిరి కాలనీ, యాప్రాల్, నేరేడ్‌మెట్, గౌతమ్‌నగర్, వినాయక్‌నగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి నిర్మాణాలకు అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు మెండుగా ఉండటంలో యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగుతున్నాయనే విమర్శలున్నాయి. అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులను ప్రశ్నిస్తే, సరైన సిబ్బంది లేకపోవడంతో అక్రమ నిర్మాణాలను నియంత్రించలేకపోతున్నామని సాకులు చెబుతున్నారు. నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారులకు సమీపంలోనే అక్రమ కట్టడాలు వెలుస్తున్నా అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం, సిబ్బంది చేతివాటం ప్రదర్శించడమే కాకుండా, స్థానిక ప్రజాప్రతినిధులు అండగా ఉంటూ అన్నీ తామై చూసుకుంటాం అంటూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న సంఘటనలు సర్కిల్ పరిధిలో చోటుచేసుకుంటున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు కూడా ఈ విషయంపై దృష్టి సారించకపోవడం గమనార్హం. మల్కాజిగిరి చౌరస్తా సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాల పక్కనే వెలుస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణం తీసుకున్న అనుమతులకు చేపట్టిన నిర్మాణానికి ఏలాంటి పొంతన లేకుండా ఇష్టాను సారంగా వెలిసినా అధికారుల్లో ఏలాంటి చలనం లేదు. ఈ నిర్మాణంలో ఓ చోట లీడర్ అన్ని తానై చక్రం తిప్పుతున్నారనే విమర్శలున్నాయి. గల్లీ లీడర్లకు కూడా మల్కాజ్గిరి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు దాసోహమై వారు చెప్పినట్లు చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. వక్ఫ్ బోర్డు స్థలాల్లో ఏలాంటి అనుమతులు లేకుండానే చేపడుతున్న నిర్మాణాలపై అధికారులు ఏలాంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. కొందరు దళారులు అక్రమ నిర్మాణదారులకు మేమే అండగా ఉండామంటూ లక్షల్లో వసూలు చేసుకుంటూ పబ్బం గడుపుతున్నట్లు పలు ఆరొపనలు వినిపిస్తున్నాయి. అధికారులు మాత్రం అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది.

### జిహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు అమలుకు దిక్కేది.?

తాజాగా అక్రమ కట్టడాలకు చెక్ పెట్టేందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్ (%ూూా%) మేరకు అక్రమమని తేలితే షోకాజ్ నోటీసులిచ్చి సీల్ చేస్తామని ప్రకటించారు. అయితే, క్షేత్ర స్థాయిలో ఈ ప్రకటన ఎంతవరకు అమలు జరుగుతుందో చూడాలి. మౌలాలీ సప్తగిరి కాలనీలోని వక్ఫ్ బోర్డు స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మల్కాజిగిరి చౌరస్తా సమీపంలోనే ఓ కళాశాల పక్కనే నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టినా చర్యలు నిల్, యాప్రాల్ సబ్ స్టేషన్ వెళ్లే దారిలో పాత ఇంటిపై అదనంగా అంతస్తుల నిర్మాణ పనులపై, సాయిబాబా ఆలయ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న నిర్మాణాలపై ప్రజావాణిలో స్థానికులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers".
H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588